## రైతు సమస్యలు పరిష్కరించాలి




మెయిన్‌లో

ప్రజాపక్షం
# జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శనివారం | 21 మార్చి, 2026 | పేజీలు : 08

# పదో తరగతి పరీక్ష కేంద్రాలలో కట్టుదిట్టమైన నిబంధనలు

**ప్రజాపక్షం/జనగామ:** పదో తరగతి పరీక్ష కేంద్రాలలో కట్టుదిట్టమైన నిబంధనలను అమలుచేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. జిల్లాలో జరుగుతున్న వార్షిక పరీక్షలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు గాను జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా డిపార్ట్‌మెంట్ అధికారులు, చీఫ్ సూపరిండెంట్స్‌లకు పలు కీలక సూచనలు జారీ చేశారు. పరీక్ష కేంద్ర ప్రాంగణంలోకి ఎవరు కూడా సెల్‌ఫోన్స్ తీసుకోకూడదన్నారు. పరీక్ష ప్రారంభానికి ముందు సీఎస్‌లు స్వయంగా కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, పరీక్ష గదులలో ఎలాంటి మెటీరియల్ లేకుండా ముందుగా నిర్ధారించుకోవాలన్నారు. పరీక్ష రాయని ఇతర గదులను తప్పనిసరిగా లాక్ చేయాలన్నారు. ఒక్క బెంచ్‌పై ఒక్క విద్యార్థి మాత్రమే కూర్చునేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు.ఈ సమావేశంలో ఏసీజీఈ రవి కుమార్, డీసీఈబీ రామరాజు, ఏపీవో శ్రీధర్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఈద్గాలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** పవిత్ర రంజాన్ పండగను పురస్కరించుకొని నగర పరిధిలోని ఈద్గాల్లో జరుగుతున్న ఏర్పాట్లను హన్మకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగరంలోని ఎల్‌బి నగర్, మాట్వాడ, బొక్కలగడ్డ ప్రాంతాల్లో ఉన్న ఈగ్గాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, అక్కడ కొనసాగుతున్న శానిటేషన్, తాగునీరు, లైటింగ్, పార్కింగ్ తదితర ఏర్పాట్లను సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముస్లిం సోదరులు రంజాన్ సందర్భంగా ప్రార్థనలు ప్రశాంతంగా నిర్వహించుకునేలా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈద్గాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ చెత్త తొలగింపు, శుభ్రపరిచే పనులను నిరంతరం కొనసాగించాలని సూచించారు. శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. స్థానిక మత పెద్దలతో మాట్లాడి వారి సూచనలను పరిగణలోకి తీసుకొని అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా తగిన చర్యలు తీసుకోవాలని, షామియానా, టెంట్లు, మంచినీటి, సౌండ్ సిస్టం తదితర అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్‌ఓ రాజారెడ్డి, ఎంహెచ్‌ఓ రాజేష్, ఈఈలు రవికుమార్, సంతోష్ బాబు, డిఈలు, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




### రాష్ట్ర బడ్జెట్‌లో రైతుల సంక్షేమానికి కనీసం 10 శాతం నిధులు

# కేటాయించకపోవడం అన్యాయం

ధరల నియంత్రణ నిధిని కేటాయించకపోవడం సిగ్గుచేటు

ఎఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్



**ప్రజాపక్షం/నర్సంపేట:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేరు గొప్ప ఊరు దిబ్బలా ఉందని, ఆరు గ్యారెంటీల అమలుపై చిత్తశుద్ధి లేదని నిరూపించిందని, వ్యవసాయ రంగం ప్రాధాన్యతను విస్మరించిందని, రాష్ట్ర ప్రజల అభివృద్ధిపై ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న గత బడ్జెట్ ఆదాయ వ్యయాలపై అసెంబ్లీలో శ్వేత పత్రం విడుదల చేయాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం శాసనసభలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన రూ.3,24,234 కోట్లతో 2026 27 బడ్జెట్‌ను 10 శాతం వృద్ధిరేటుతో ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టారని కానీ ఆచరణలో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ పాలనకొనసాగిస్తున్నారని, అందుకు నిదర్శనమే గత బడ్జెట్ కేటాయింపులని విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి రెండున్నర సంవత్సరాలు దాటిన పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం, హామీలపై చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. రైతుల వ్యవసాయాన్ని అభివృద్ధి పరిచేందుకు బడ్జెట్లో కనీసం 10 శాతం నిధులను కేటాయించకుండా రైతుల రుణాలను, రైతు భరోసాను, వరి ధాన్యం, బోనస్ డబ్బులను చెల్లించకుండా, రైతులు పండించిన మొక్కజొన్న, వరి, పప్పు దినుసులు, ఇతర పంటలకు కనీస మద్దతు ధర అమలయ్యే విధంగా ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయకుండా, రైతుల భూములను రికార్డుల్లో నమోదు చేయకుండా రాష్ట్ర అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి జరగాలంటే సన్న చిన్న కారు రైతుల వ్యవసాయ రంగానికి 20 శాతం బడ్జెట్ కేటాయిస్తూ, ఉపాధి, మహిళా, పారిశ్రామిక, కార్మిక రంగాల ప్రాధాన్యత కనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, అలాగే విద్య, వైద్య, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఆరు గ్యారంటీలను 420 హామీలను నెరవేర్చే విధంగా బడ్జెట్ రూపకల్పన చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపి బడ్జెట్ లోపాలను మరుగుపరిచే విధంగా చేయొద్దన్నారు.

## కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

**ప్రజాపక్షం/కమలాపూర్:** ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను ప్రభుత్వ విప్‌గా నియామకం అవ్వడం పట్ల కమలాపూర్ కాంగ్రెస్ శ్రేణులు స్థానిక బస్టాండ్ వద్ద బాణసంచా పేల్చి, స్వీట్లను పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బల్మూరి వెంకట్ ప్రభుత్వ విప్‌గా నియమించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నతమైన స్థానం పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# రైతు మహోత్సవ సభను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/కమలాపూర్:** మార్చి 20–21–22 తేదిలలో రైతు మహోత్సవ సభలు సిద్ధిపేట జిల్లా లోని నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో జరిగే సభలకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని మండల వ్యవసాయ అధికారి బి. వేణు మండలంలోని అన్ని గ్రామాల రైతులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం , రైతు భరోసా నిధుల విడుదల పలు కీలక అంశాల పై సభలో ప్రసంగించనున్నట్లు తెలిపారు. అదే విధంగా అక్కడ ఏర్పాటు చేసినటువంటి అనేక రకాల పనిముట్లు, వ్యవసాయం పై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి రైతు హాజరుకావాలని ఆయన కోరారు.

# అణగారిన వర్గాల ప్రజలను మోసగించిన బడ్జెట్

**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వెనుకబడిన వర్గాలను పేదరిక నిర్మూలనకు దోహదపడే అన్ని రంగాలకు రాష్ట్ర వార్షిక బడ్జెట్లో నామమాత్రపు కేటాయింపులు చేసి, నిరుపేద ప్రజలను నయవంచన చేసింది ఈ ప్రభుత్వమని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు బొంకూరి రాజు ఒక ప్రకటన ద్వారా విమర్శించారు. సామాజిక న్యాయానికి పేదరిక నిర్మూలనకు దోహదం చేసే విద్య, వైద్య రంగాల సమగ్ర అభివృద్ధికి కలిపి కనీసం మొత్తం బడ్జెట్లో 30 శాతం కేటాయించాల్సి ఉండగా, విద్యారంగానికి 8.2 శాతం నిధులు కేటాయించి అత్యంత దారుణంగా వైద్య రంగానికి కేవలం 4.2 నామమాత్రపు నిధులు కేటాయించి ప్రభుత్వ విద్య, వైద్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, కార్పొరేట్ వ్యవస్థను పెంచి పోషిస్తూ నిరుపేద వర్గాలకు అన్యాయం చేస్తుంది ఈ ప్రభుత్వమని విమర్శించారు. బీసీ సబ్ ప్లాన్ చట్టం అమలు చేస్తానని చెప్పి బీసీ ప్రజలను నయవంచన చేసి మొండి చేయి చూపించింది, ఈ బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ శాఖలకు నామమాత్రపు కేటాయింపులు మాత్రమే చేసింది పశుసంవర్ధశాఖకు ప్రతి ఏటా బడ్జెట్లో కోత విధిస్తూ పాడి రైతులకు ప్రభుత్వం అన్యాయం చేస్తుందన్నారు. రైతు కూలీలకు, సన్నకారు రైతులకు ప్రతి ఏటా ఇస్తానన్న ఆర్థిక చేయూతకు మొండి చేయి చూపించారు. ఈ బడ్జెట్లో అసంఘటిత కార్మికుల సంక్షేమానికి నిరుపేదలకు పౌష్టికాహారాన్ని అందించడం కోసం ఆహార భద్రత పథకానికి ప్రత్యేక కేటాయింపులు లేకపోవడం విచారకరమన్నారు. ప్రతి సంవత్సరం బలహీనవర్గాల శాఖలకు నామమాత్రం కేటాయించిన బడ్జెట్ పక్కదారి పట్టించి, పేద వర్గాల ప్రజలను నయవంచన చేస్తున్నాయి ఈ ప్రభుత్వాలు ఉన్నారు. కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ము కాసే విధంగా కాకుండా పేద అణగారిన వర్గాల అభ్యున్నతికి ఉపయోగపడే విధంగా సమగ్ర దృష్టి సారించాలని ఈ ప్రభుత్వాన్ని బొంకూరి రాజు కోరారు.

# ద ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో సోమనాథ్ జ్యోతిర్లింగ దర్శనం

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** 28 మార్చి 2026 సాయంత్రం 5గంటల నుండి రాత్రి 8గంటల వరకు వీరబ్రహ్మేంద్ర స్వామి మండపం భద్రకాళి దేవాలయం పక్కన సుమన్ సిల్వర్ ప్యాలెస్, ప్రతాప్ గోల్డ్ టెస్టింగ్ అండ్ మెల్టింగ్ సెంటర్ విశ్వకర్మ వీధి వరంగల్ అడ్రస్ నందు జరుగుతాయని ఉచిత దర్శనం ఉందని, అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు సంజీవ్ గురూజీ తెలిపారు. ద ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారి ఆధ్వర్యంలో సోమనాథ్ జ్యోతిర్లింగాల దివ్యదర్శన అనుభూతి పొందాలని, సోమనాథ్ సపర్య పూజ, ధ్యానం, సత్సంగం, ప్రసాద వితరణ, స్వామివారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

# మండుటెండలో వికలాంగ ఉపాధి కూలీలు



**ప్రజాపక్షం/ఆత్మకూరు:** జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేస్తున్న వికలాంగులైన ఉపాధి కూలీలు ఎండలో మండుతుంటే కనీసం అటువైపు ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ ఇతర అధికారులు కన్నెత్తి చూడని పరిస్థితిలో ఇంత నిర్లక్ష్యమా అని వికలాంగులైన ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .ఆత్మకూరు మండలం నీరుకుళ్ళ గ్రామంలో వికలాంగులైన ఉపాధి కూలీలు ఉదయం 8:00 నుండి 11:30 వరకు వారికి కేటాయించిన పనినీ పూర్తిచేసుకుని వారు ఫోటో అప్లోడ్ కోసం ఫీల్డ్ అసిస్టెంట్ కోసం గంటలు, గంటలు ఎదురుచూసినా కూడా ఫోటో అప్లోడ్ చేసుకునే ఏ అధికారి కూడా అక్కడికి రాకపోవడంతో ఉపాధి కూలీలు మండుటెండలో సైతం ఎదురు ఎదురుచూస్తూ ఉంటామని ఆవేదన చెందారు. మేము అసలే వికలాంగులం మాపైన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని ఆ గ్రూపు మేటు పావుశెట్టి రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మేము ఉదయాన్నే మాకు నిర్ణయించిన పని మేము చేసి పూర్తి చేసిన తర్వాత కూడా ఫీల్డ్ అసిస్టెంట్ ఫోటో తీయడానికి రావడంలో చాలా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. మాకు కనీసం మంచినీళ్లు గాని ఉండవని ఆవేదన చెందారు. పై అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్న కూడా లాభం లేదన్నారు. .ఇప్పటికైనా మా గ్రూపు సభ్యులం వర్క్ పూర్తి చేసిన తర్వాత ఫోటో అప్లోడ్ చేయాలని కోరుతున్నారు. అని పై అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన వారు పట్టించుకోరని వికలాంగులపైన ఇంత నిర్లక్ష్యం మా అని వారు అధికారులపై మండిపడుతున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ పై సరైన చర్య తీసుకోవాలని కోరుచున్నామన్నారు.

# వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా హెల్త్ క్యాంప్



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** ప్రజాపాలన–ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌ను వంగర గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అప్పయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ గజ్జల సృజన రమేష్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ క్యాంప్ నిర్వహించబడిందని తెలిపారు.ఈ క్యాంప్‌లో ఎంజీఎం, సీకేఎం ఆసుపత్రుల నుండి వచ్చిన నిపుణులైన వైద్యులు పాల్గొని సేవలు అందించారు. జనరల్ ఫిజీషియన్, పిల్లల వైద్యుడు, ఎముకల నిపుణుడు, స్త్రీరోగ నిపుణురాలు ద్వారా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించబడినాయి.మొత్తం 147 మంది ప్రజలు ఈ ఆరోగ్య సేవలను వినియోగించుకోగా, అందులో 28 మందిని మెరుగైన చికిత్స కోసం హయ్యర్ సెంటర్లకు రిఫర్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లాల రమేష్, వార్డ్ మెంబర్ శ్రీ రామోజీ మొండయ్య, గజ్జల రమేష్, డా. రహ్మాన్, డాక్టర్ రుబీనా, నర్సింగ్ అధికారులు, సూపర్వైజర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ మెగా హెల్త్ క్యాంప్ ద్వారా గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

# భద్రకాళి అమ్మవారికి లిల్లీ పూలతో లక్ష పుష్పార్చన



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలోని శ్రీ భద్రకాళి దేవస్థానంలో శ్రీ పరాభవ నామ సంవత్సర యుగాది(ఉగాది) నుండి శ్రీ భద్రకాళి వసంత నవరాత్ర మహోత్సవాలు గురువారం నుండి శుక్రవారం వరకు అత్యంత వైభవోపేతంగా నిర్వహించబడుతున్నాయి. వసంత నవరాత్ర మహోత్సవాలు ఈ రోజుతో రెండవ రోజుకు చేరుకున్నారు. ఈ రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం జరుపబడిన పిమ్మట అమ్మవారికి లక్ష లిల్లీ పూలతో లక్ష పుష్పార్చన నిర్వహించడింది. ఈ కార్యక్రమం శ్రీ భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ముఖ్య అర్చకులు వెంకటనాగరాజ శర్మ, వేద విద్యార్థులు నిర్వహించారు. లక్ష పుష్పార్చనకు ఉభదాతలుగా వరంగల్ ప్రముఖ వ్యాపారి సురినేని నవీన్ రావు, నీరజ దంపతులు వ్యవహరించారు. శుక్రవారం కూడా భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. ఈ వసంత నవరాత్రులలో అమ్మవారికి నిర్వహించు లక్ష పుష్పార్చన భక్తులు దర్శించుకొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కార్యనిర్వహణాధికారి రామల సునీత కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, గాండ్ల స్రవంతి, పాలడుగుల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి



**ప్రజాపక్షం/వరంగల్:** జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని పట్టణ ఆరోగ్య కేంద్రం పబ్లిక్ హెల్త్ మేనేజర్ ఏలుగు సుజాత అన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల యూనియన్ ఏఐటీయూసీ ట్రేడ్ యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం రోజున రంగశాయిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఉద్యోగులు భోజన సమయంలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ ఉద్యోగులకు సెప్టెంబర్ నుండి జనవరి వరకు 5 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. ఉద్యోగులందరికీ క్యాడర్ ఫిక్సేషన్ చేయాలని, ప్రతి నెల 5వ తేదీన వేతనాలు అందరికీ చెల్లించాలని, తక్షణమేపై సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28 లోగా పెండింగ్ వేతనాలు మొత్తం చెల్లించాలని, చెల్లించలేని పక్షాన ఈనెల 29 నుండి హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద మహధర్నా కు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ ఆఫీసర్ సతీష్ కుమార్, నర్సింగ్ ఆఫీసర్ సుమలత, రజిత, గౌస్ పాషా, లక్ష్మీ బాయి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం



**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండలం టికె తండా గ్రామ పంచాయతీ పరిధిలోని బొగ్గుల తండాలో నూతన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి ముఖ్య అతిదిగా హాజరై రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, మాధవరెడ్డి నాయకత్వంలో ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగంగా అమలువుతున్నాయని పేర్కొన్నారు. వారి కుటుంబం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, వర్కింగ్ ప్రెసిడెంట్లు మాదటి శ్రీనివాస్, లావుడ్యా తిరుమల్, కోశాధికారి కెవి సుబ్బారెడ్డి, చల్లా శ్రీపాల్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, మార్కెట్ టైరెక్టర్ రావుల మహిపాల్‌రెడ్డి, బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# సిసి రోడ్డుకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండలం లావుడ్యా వాగ్య నాయక్ తండా, బంజరపల్లిలలో రూ.5లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు శంకస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. నర్సంపేట ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి ఆధ్వర్యంలో ఈజిఎస్ నిధులతో మంజూరైన ఈ పనులకు టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, వర్కింగ్ ప్రెసిడెంట్ లావుడ్యా తిరుమల్, చల్లా శ్రీపాల్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్‌రెడ్డి, తండా సర్పంచ్ భూక్య బాజు, మిట్టు నాయక్, బంజర్‌పల్లి సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్, వార్డు సభ్యులు భూక్య చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. తండాలు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. రహదారుల నిర్మాణం వలన రాకపోకలు సులభతరం అవుతాయని, అభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు దొంతి మాధవరెడ్డి ద్వారా చేపడతామని హామీ ఇచ్చారు.

# వాగ్యనాయక్ తండాలో నూతన వీధి దీపాల ఏర్పాటు

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండలంలోని వాగ్యనాయక్ తండా గ్రామ పంచాయతీలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నూతన వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ బాజు మిట్టు, ఉప సర్పంచ్ బిమ్మన ఆధ్వర్యంలో చేపట్టారు. గ్రామంలోని ప్రధాన వీధులు, అంతర్గత రహదారుల వెంట ఈ దీపాలను ఏర్పాటు చేయడం వలన రాత్రి సమయంలో ప్రజలకు సురక్షిత ప్రయాణం సులభతరం కానుంది. ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, వృద్దులు రాత్రివేళల్లో ఎదుర్కొనే ఇబ్బందులు తగ్గనున్నాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని సర్పంచ్ బాజు మిట్టు తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో వాగ్య నాయక్ తండా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే దిశగా కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు.

# ఘనంగా ఠాణునాయక్ 77వ వర్ధంతి

**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట పట్టణంలో ఘనంగా జాటోత్ ఠాణు నాయక్ 77 వ వర్ధంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కౌన్సిలర్ భూక్యా మాతృ రాథోడ్ ఆధ్వర్యంలో జాటోత్ ఠాణునాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, దేశ ముఖులకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వీరుడు ఠాణు నాయక్ అని కొనియాడారు. గోర్ బంజారా ప్రజలు వారి ఆశయ సాధనకై కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాకారులు బోడ కిషన్ నాయక్, గోర్ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ధరావత్ కిషన్ నాయక్, గోర్ సేన జిల్లా ఉపాధ్యక్షులు బోడ బాబు నాయక్, జిల్లా మీడియా వింగ్ ఇంచార్జ్ భూక్య వెంకన్న నాయక్, గోర్ సేన డివిజన్ కార్యదర్శి రమేష్ నాయక్, నెక్కొండ మండల గోర్‌సేన అధ్యక్షులు మురళి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యకు కేటాయింపులు లేకపోవడం విచారకరం

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** ఎన్నికల ముందు ఇచ్చిన విద్యారంగానికి 15శాతం నిధుల హామీల అమలుచేయకుండా విద్యారంగానికి అరకొర పెంపువల్ల ప్రయోజనం లేదని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షులు చంద్రశేఖర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2026–27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ. 3,24,234 కోట్ల బడ్జెట్‌లో విద్య, మానవ వనరులకు కెటాయించింది రూ.26,674 కోట్లు మాత్రమేనన్నారు. గత సంవత్సరం కంటే రూ.3566 కోట్లు అదనంగా కెటాయించినప్పటికీ పెంచిన మొత్తం బ్రేక్‌ఫాస్ట్, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజన పథకం విస్తరణ, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు కోసమే సరిపోవచ్చన్నారు. విద్యకు 15శాతం కెటాయిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్న హామీ వరుసగా 3వ బడ్జెట్‌లో కూడా నెరవేరలేదన్నారు. పెండింగ్ డీఏలు, పెండింగ్ బిల్లులు, 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు గురించి ప్రస్తావనే లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ, పెండింగ్ బిల్లులు, బకాయిల గురించి కూడా స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

# సామాజిక అంశాలే కవుల ప్రాధాన్యత కావాలి



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** సామాజిక అంశాలను ఇతివృత్తంగా తీసుకుని కవులు ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ఉందని సలాం జనగామ పుస్తక రచయిత సాంబరాజు యాదగిరి అన్నారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక కవి సమ్మేళనం పొట్టబత్తిని భాస్కర్ అధ్యక్షతన జరిగింది. ఈ కవి సమ్మేళనంలో యాదగిరి మాట్లాడుతూ సామజిక కవి సమ్మేళనాన్ని ఒక సామాజిక స్పృహ కలిగిన టీఎస్‌యూటీఎఫ్ లాంటి ఉపాధ్యాయ సంఘం నిర్వహించడం సంతోషించదగిన విషయమన్నారు. సమాజ నిర్మాణంలో కవుల పాత్ర కీలకమని, సామాజిక అంశాలను ఇతివృత్తంగా తీసుకుని రచనలు చేయడం, పేద, కార్మిక, కర్షక వర్గాలకు అండగా ఉండేలా తమ కవితల ద్వారా ప్రభుత్వం మేల్కొనేలా చెయ్యడం ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రావు, వెంకటేష్, శ్రీనివాసరావు, సాదిక్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గోపి, బాధ్యులు కనకయ్య, శ్రీనివాస్, రవీందర్, మహేష్, అహ్మద్ పాషా, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# సుందర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** వేసవికాలం దృష్ట్యా ప్రయాణికులకు, ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు సుందర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దేవరుప్పుల మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా ప్రాంగణ సమీపంలో చలివేంద్రం ఏర్పాటుచేయగా ఆ చలివేంద్రాన్ని సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్ ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్‌గౌడ్, ఉప సర్పంచ్ కోమలత సోమశేఖర్, పార్టీ సీనియర్ నాయకులు బిక్షపతి, సోమనర్సయ్య, ఉప్పల్‌రెడ్డి, కిష్టయ్య, దశరథ, అబ్బసాయిలు, మల్లేష్, రామచంద్రు, వార్డు సభ్యులు రమేష్, సందీప్, మల్లయ్య, పాల్గొన్నారు.

# డిహెచ్ పిఎస్ జిల్లా రెండవ మహాసభ




**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** దళిత హక్కుల పోరాట సమితి రెండవ మహాసభ మార్చి 22న హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయం బాలసముద్రంలో జరుగుతుందని, ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే పోతురాజు సారయ్య,దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా నిర్మాణ బాధ్యులు కొట్టేపాక రవి పాల్గొననున్నారని, ఈ సభను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. శుక్రవారం హసన్ పర్తి మండల కేంద్ర పరిధిలో ఉన్న కోమటిపల్లి, దేవన్నపేట్ గ్రామాలలో జరిగిన సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంటాల దేవా మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి దాదాపు 76 సంవత్సరాలు గడిచిన కూడా. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళితులకు ఒరగబెట్టింది ఏమీ లేదు అని ఆయన మండిపడ్డారు. దళితులపై దాడులు ఆగలేదని, రాష్ట్ర ,కేంద్ర బడ్జెట్లో 20 శాతం నిధులను బడ్జెట్లో దళితులకు కేటాయించాలని, కేటాయించిన నిధులను పూర్తిగా దళితుల అభివృద్ధికి దళితుల సంక్షేమానికి, ఉపయోగించాలని ఆయన డిమాండ్ చేశారు. దళితులకు కేటాయించిన నిధులను దారి మళ్లిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు ప్రవేట్ రంగాలలో కూడా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను విడుదల చెయ్యాలని, ఎస్సీ కార్పొరేషన్ లోన్స్ అప్లికేషన్ చేసుకునే విధంగా అవకాశం కల్పించాలని ఆయన అన్నారు. డీహెచ్ పీఎస్ హసన్ పర్తి మండల ఉపాధ్యక్షులు బోడిగే కమలాకర్.రాజారపు దేవయ్య. రాజారపు శ్రీను,సందెల చిన్న కొమురమ్మ, సందెల లక్ష్మి , సందెల కళ్యాణి, సందెల జగన్, సందెల మోహన్, సందెల బిక్షపతి, కదారి కోటి,నమిండ్ల కుమార్, నమిండ్ల నరేష్, నమిండ్ల అన్నమయ్య ఈ సమావేశంలో తదితరులు పాల్గొన్నారు.

# ముస్త్యాలపల్లి పాఠశాలలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం



**ప్రజాపక్షం/నడికూడ :** నడికూడ మండలం ముస్త్యాలపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో పక్షుల పట్ల ప్రేమ,బాధ్యతను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించగా,చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు.పిచ్చుకల జీవన విధానం,వాటి ప్రాధాన్యతను,సంరక్షణను ప్రతిబింబించేలా అందమైన చిత్రాలను గీశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ,ప్రకృతి సమతౌల్యాన్ని కాపాడటంలో పిచ్చుకలు కీలక పాత్ర పోషిస్తాయని ఆధునిక జీవనశైలి కారణంగా పిచ్చుకల సంఖ్య తగ్గిపోతున్నందున,వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఎండాకాలంలో పక్షులకు తాగు నీరు,ఆహారం అందించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ,"పిరికెడు గింజలు..గ్లాసెడు నీళ్లు"అనే చిన్న చర్యతో పిచ్చుకల ప్రాణాలను కాపాడవచ్చని విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పావని,సత్యపాల్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడ్జెట్ మాయల ఫకీరు బడ్జెట్




**ప్రజాపక్షం/నడికూడ :** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ మాయల ఫకీర్ బడ్జెట్ అని నడికూడ మండలానికి చెందిన పరకాల మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పోచంపల్లి రఘుపతి, బిఆర్ఎస్ పార్టీ కంఠాత్మకూర్ గ్రామ పార్టీ గుడికందుల శివ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హామీలు గొప్పగా అమలు సున్నా! అని, తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మొండి చెయ్యి చూపించిందని, రూ.3,24,234 కోట్ల భారీ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులు కేవలం రూ. 26,674 కోట్లేనని అన్నారు. రానున్న ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విద్యార్థుల సత్తా ఏంటో చూపిస్తామని,ఇది నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం వంటిదని, బడ్జెట్ సమావేశాల్లో నిరుద్యోగ భృతి ప్రకటన లేదని,జాబ్ కాలెండర్ జాడలేదని,ఉద్యోగ నోటిఫికేషన్ల మీద ఊసలేదన్నారు.ఆరు గ్యారెంటీల అమలు లేదని,రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, గంటకు రూ.19 కోట్ల చొప్పున అప్పు తెస్తున్నారని, తులం బంగారం మోసం,రెండు లక్షల ఉద్యోగాలు మోసం,బడ్జెట్ అంతా మోసం అని తెలిపారు.

# రైతు మేళాను విజవంతం చేయండి



**ప్రజాపక్షం/వేలేరు :** ఈనెల 22 వ తేదీన సిద్దిపేట జిల్లా నర్మెట గ్రామంలో రాష్ట్రముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డిచే ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సంధర్భంగా 20వ తేదీ నుండి 22 వతేదీ వరకు సిద్దిపేట జిల్లా నర్మెట గ్రామాంలో జరిగే రైతు మేళా ఎగ్జిబిషన్‌కు వేలేరు మండల రైతులు అధిక సంఖ్యలో హాజరై రైతు మేళా ఎగ్జిబీషన్‌ను విజవంతం చేయాలని వేలేరు మండలవ్యవసాయ శాఖ అధికారి కవిత ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఈసంధర్భంగా కవిత మాట్లాడుతూ రైతులకు బస్ సౌకర్యం కల్పించడం వలన 20 వ తేదీన వేలేరు మండలంలోని పలుగ్రామాల రైతులు నర్మెటకు బస్‌లో వెల్లడం జరిగిందని 22/03/2026 తేదీన సిద్దిపేట జిల్లా నర్మెట గ్రామంలో రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిచే ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సంధర్భంగా వేలేరు మండలకేంద్రంలోని రైతు వేధిక వద్ద 3 బస్‌లను ఏర్పాటు చేయడం జరిగింది కనుక వేలేరు మండల రైతులు ఈసదావకాశాన్ని సద్వినియోగం చేసుకొనుటకు మీగ్రామాలకు సంబందించిన ఎఇఒలు(1), రాజశేఖర్ : వేలేరు,బండతండ,శాలపల్లి,లోక్యతండ, గొల్లకిష్టంపల్లి, చింతల తండ, కమ్మరిపేట ఫోన్‌నెం, 7382107426,..(2),విజయ్ : పీచర, కన్నారం, మద్దెలగూడెం, (3), శిల్ప : ఎర్రబెల్లి, గుండ్లసాగర్, సోడషపల్లి, మల్లికుదుర్ల . (4),వేలేరు మండల వ్యవసాయశాఖ అధికారి కవిత 8977744974 నెంబర్లను సంప్రదించి రైతుమేళాను విజయవంతం చేయాలని రైతులను కోరారు.

# ఈద్–అల్–ఫితర్ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు పవిత్ర రంజాన్ మాసం ముగింపును సూచించే ఈద్‌అల్‌ఫితర్ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసం అంత ముస్లిం సోదర సోదరీమణులు ఎంతో భక్తి, నిబద్ధతతో ఉపవాస దీక్షలు ఆచరించి ఆధ్యాత్మిక విలువలను చాటుకున్నారని పేర్కొన్నారు.శాంతి, సౌహార్దత, సహనం, పరస్పర గౌరవాన్ని పెంపొందించే ఈ పవిత్ర పండుగ సమాజంలో ఐక్యతను మరింత బలపరచాలని ఆకాంక్షించారు.అల్లాహ్ కృపతో ప్రతి ఇంటిలో సుఖశాంతులు నెలకొని, ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఎమ్మెల్యే కోరుకున్నారు.

# రైతుభరోసా పథకాని దరఖాస్తులు చేయండి

**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండలోని రైతుసోదరులు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన వారు యాసంగి రైతు భరోస పథకం 20252026 సంవత్సరానిగాను 28 /02 /2026 నాటికి కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం గల రైతులు రైతుబంధు పథకానికి మార్చి 25/03/2026 వరకు దరఖాస్తు చేసుకోవాలని మండలవ్యవసాయ శాఖ అధికారి కవిత ఓ ప్రకటనలో తెలిపారు.కవిత వివరాల ప్రకారం రైతు భరోస పథకానికి కావలసినవి 1,పట్టాదారు పాసుపుస్తకం.2,ఆధార్ కార్డు.3,బ్యాంక్ ఎకౌంట్ పుస్తకం జిరాక్స్ కాపీలను మీగ్రామవ్యవసాయ విస్తరణ అధికారికి 25/03/2026 వరకు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

# మాకు న్యాయం చేయాలి

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని ఆలీంపూర్ గ్రామంలో ఉన్న వ్యవసాయ భూమిని మాకు తెలియకుండా కొందరు వ్యక్తులు ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు దాసారం బాలయ్య, కుమారులు దాసారం వెంకటయ్య, బాలమల్లు, కిష్టయ్యలు కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి తన తండ్రికి చెందిన భూమిని కొందరు వ్యక్తులు తమకు తెలియకుండానే ప్లాట్లు చేసి అమ్ముతున్నాని తెలియడంతో ఆ భూమి వద్దకెళ్లి అడుగగా బెదిరింపులకు గురి చేస్తున్నారని వారు వాపోయారు. ఉన్నత అధికారులు దీనిపై విచారణ చేపట్టి మాకు సంబంధించిన భూమిలో ప్లాట్లు విక్రయించిన వారిపై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని బాధితులు కోరారు.

# స్కూల్స్, కాలేజీ 100 మీటర్ల సమీపంలో పాన్‌షాప్‌లు ఉండొద్దు

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** స్కూల్స్, కాలేజీ 100 మీటర్ల సమీపంలో పాన్‌షాప్‌లు ఉండొద్దని సీఐ సృజన్‌కుమార్ హెచ్చరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వరంగల్ సీపీ ఆదేశాల మేరకు ఎవరైనా స్కూల్స్, కాలేజీల 100 మీటర్ల సమీపంలో పాన్‌షాప్‌లు నడిపితే వారిపై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. సిగరెట్‌తోపాటు ఇతర పొగాకు ఉత్పత్తులు మైనర్లకు అమ్మితే, పట్టుబడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మండలంలోని కోల్కొండలో స్కూల్ సమీపంలో పాన్‌షాప్ నిర్వహిస్తున్న రాజశేఖర్ అనే వ్యక్తిపై కేసు నమోదుచేశామని సీఐ తెలిపారు.

# ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద లబ్ధిదారుల ఎంపిక

**ప్రజాపక్షం/జనగామ:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పీఎంఎంఎస్‌వై (ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన) పథకం కింద మోటార్ సైకిల్‌తోపాటు ఐక్ బాక్స్‌ల యూనిట్లను లబ్దిదారులకు అందించేందుకుగాను జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఎంపిక చేశారు. జిల్లాకు కెటాయించిన మొత్తం 13 యూనిట్లకు గాను 101 దరఖాస్తులు రాగా, వాటిలో 94 దరఖాస్తులు ఎంపిక కాగా ఈ ఎంపికలో జనరల్ 40శాతం, మహిళలు 60శాతం, ఎస్సీ, ఎస్టీ 60 శాతం కోటా ప్రకారం జనరల్ కేటగిరి నుంచి 8 మంది, ఎస్సీ కేటగిరి నుంచి ఇద్దరు, ఎస్టీ కేలగిరి నుంచి ఒకరు, మహిళా కేటగిరీ నుంచి ఇద్దరు లబ్దిదారులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి రాణా ప్రతాప్, డీఏవో అంబికా సోని, జిల్లా ఫిషరీస్ చైర్మన్ నీల రాజు, తదితరులు పాల్గొన్నారు.

## జాటోత్ హుస్సేన్ నాయక్‌ను పరామర్శించిన ప్రముఖులు

ప్రజాపక్షం/గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల శివారు తర్వాతదాలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ తండ్రి లచ్చా నాయక్ చిత్రపటం ఎదుట పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మాజీ పార్లమెంట్ సభ్యురాలు టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాలోత్ కవిత నాయకులు పర్కాల శ్రీనువాస్‌రెడ్డి ముత్యం వెంకన్న గౌడ్ మహబూబ్ పాష నల్లని నవీన్ రావు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్ రావు టీయూడబ్ల్యూజే (ఐజెయు) జిల్లా అధ్యక్షుడు సిహెచ్ శ్రీనువాస్ బోడ పృథ్వీరాజ్ పోన్నాల యుగేందర్ సామాజిక ఉద్యమ నేతదళితరత్న కోండ ఎల్లయ్య నాయకులు హెచ్ శ్రీను రాము బోడ సూరయ్య గోపా డివిజన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ అల్లం నాగేశ్వర్‌రావు మున్సిపల్ చైర్మన్ బానోత్ సునీతా వుంకన్ననాయక్ భూమాటి పురుషోత్తం అదువిధంగా టీజీఎస్ ఆర్టిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ కౌన్సిలర్ రాజేందర్ సిరిసిల్ల మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గుగులోత్ హథిరాం లు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## జాటోత్ హుస్సేన్ నాయక్ తండ్రి మృతి పట్ల చైర్ పర్సన్ అంతర్ సింగ్ ఆర్య సంతాపం

ప్రజాపక్షం/గూడూరు: ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న జాతీయ ఎస్టీ కమిషన్ చైర్ పర్సన్ అంతర్ సింగ్ ఆర్య శుక్రవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల శివారు తర్యాతండా గ్రామానికి సాయంత్రం సేమారు 7 గంటల సమయంలో చేరుకున్నారు. ఈసందర్భంగా ఆయన మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఈ క్లిష్ట సమయంలో ఆత్మస్థైర్యంతో ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎడ్ల అశోక్‌రెడ్డి మాజీ ఎంపి అజ్మీర సీతారాం నాయక్ నాయకులు స్థానిక గ్రామ ప్రజలు మరియు అధికారులు పాల్గొన్నారు.

## యువత అన్నిరంగాల్లో రాణించాలి

ప్రజాపక్షం/మంగపేట: క్రీడాకారులు క్రీడలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మంగపేట తహసీల్దార్ తోట రవీందర్ అన్నారు. శుక్రవారం మంగపేట మండలంలోని, చుంచుపల్లి గ్రామంలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం రెండు జిల్లాల స్థాయి నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తోట రవీందర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మేర యువ భారత్ వరంగల్ కేంద్రం వారి ఆధ్వర్యంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ కళ్యేబోయిన కిరణ్ అధ్యక్షతన పలు గ్రామాలు వాగొడుగూడెం, చుంచుపల్లి, లక్ష్మీనర్సపురం, రమణక్కపేట, తిమ్మంపేట గొల్లగూడెం, కోడిశెల, లక్ష్మీపురం, జానంపేట గ్రామాలకు చెందిన క్రీడాకారులకు ఆటవస్తుల కిట్లు అందజేయడం జరిగింది. ఆటలు మానసిక ఉల్లాస కలిగిస్తూ,నూతన స్నేహ భావం ఏర్పడుతుందని అన్నారు. సమాజంలో మార్పు రావాలంటే యువత ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలని అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చేటువంటి బెనిఫిట్స్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనవాసి కళ్యాణ పరిషత్ జిల్లా సంఘటన కార్యదర్శి నూనె రాజు, ఊకం కృష్ణవేణి, పూణెం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ప్లాటినం జూబ్లీ వేడుకలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్లాటినం జూబ్లీ వేడుకలను ఈ నెల 29వ తేదీన (ఆదివారం) ఘనంగా నిర్వహించనున్నట్లు కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఇ.వి. శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, సుమారు 70 సంవత్సరాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలో పాల్గొనదలచిన పూర్వ విద్యార్థులందరూ ముందస్తుగా తమ నమోదు పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 1,000 ను సంఘం బ్యాంక్ ఖాతాలో జమ చేసి, తమ వివరాలను ఆర్గనైజింగ్ కమిటీకి తెలియజేయాలని సూచించారు.కార్యక్రమ తేదీ సమీపిస్తున్న దృష్ట్యా, హాజరయ్యే సభ్యుల సంఖ్యను అంచనా వేసి తగిన ఏర్పాట్లు చేయడానికి ముందస్తు రిజిస్ట్రేషన్ ఎంతో అవసరమని తెలిపారు. ఈ నేపథ్యంలో, రిజిస్ట్రేషన్ గడువును ఈ నెల 22వ తేదీ (ఆదివారం) వరకు మాత్రమే నిర్ణయించినట్లు వెల్లడించారు.మరో రెండు రోజుల్లో గడువు ముగియనున్నందున, ఇప్పటివరకు నమోదు చేసుకోని పూర్వ విద్యార్థులందరూ వెంటనే తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఈ సందర్భంగా ఇ.వి. శ్రీనివాస్ రావు పిలుపునిచ్చారు.

## రాష్ట్ర బడ్జెట్లో మరోసారి బిసిలకు మోసం



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా విస్మరించిందని,బీసీలకు మరోసారి మోసం జరిగిందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యానించారు.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క 3,24,234 కోట్ల భారీ బడ్జెట్ ను ప్రవేశపెట్టి జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు 5 శాతం నిధులు కూడా కేటాయించకపోవడం విచారకరమని ఎంపీ రవిచంద్ర తన ప్రకటనలో పేర్కొన్నారు.సమగ్ర సర్వే సందర్భంగా బీసీల జనాభాను 40లక్షలకు పైగా తగ్గించి చూపడమే కాక, కామారెడ్డిలో ఆర్భాటంగా ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడంలో,ప్రతి ఏటా బడ్జెట్లో 20వేల కోట్ల చొప్పున కేటాయిస్తామన్న హామీని కాంగ్రెస్ సర్కార్ నిలబెట్టుకోవడంలో విఫలమైందని ఆయన మండిపడ్డారు.మంత్రిమండలిలో యాదవ,మున్నూరుకాపు,రజక, లంబాడీలకు స్థానం కల్పించకుండా, కార్పోరేషన్ ఛైర్మన్ ల నియామకాలలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని ఎంపీ రవిచంద్ర ఆవేదన వెలిబుచ్చారు.ఎన్నికల సమయంలో యువత ఓట్ల కోసం 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీనిచ్చి నెరవేర్చకపోవడంతో విద్యావంతులైన నిరుద్యోగ యువత తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు.వృత్తి విద్యా కోర్సులు చదువుతున్న వారి ఫీజు బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడం, బడ్జెట్లో ఆ ప్రస్తావనే లేకపోవడం శోచనీయమని ఎంపీ రవిచంద్ర అన్నారు.జర్నలిస్టుల సంక్షేమం గురించి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనకపోవడం విచారకరమన్నారు. మంత్రివర్గంలోకి వెంటనే ముగ్గురు బీసీలను తీసుకోవాలని,42 శాతం రిజర్వేషన్ల అమలునకు పార్లమెంటులో బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన ప్రైవేట్ మెంబర్ బిల్లుకు కాంగ్రెస్ అధిష్టానాన్ని ఒప్పించి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర వత్తిడి పెంచాల్సిందిగా ఎంపీ వద్దిరాజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ప్రజాపక్షం/భూపాలపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బిజెపి భూపాలపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ చందుపట్ల కీర్తి రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ, జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా ఎస్టి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రవి నాయక్, నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి, హాజరయ్యారు.విశిష్ట అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపల్లి పాపయ్య, చదువు రామచంద్రారెడ్డి, కన్నం యుగదీశ్వర్ , ఆరో వార్డు కౌన్సిలర్ ఎరుకల రేణుక గణపతి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రజలు అపార నమ్మకంతో ఓటు వేసి అధికా రంలోకి తీసుకు వచ్చారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైన బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలో రైతులు, మహిళలు, యువత, కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, కానీ ప్రభుత్వం వాటి పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సంక్షేమ పథకాలు ఆలస్యంగా అమలు కావడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ రావు, రాష్ట్ర నాయకులు బట్టు రవి, రాజు నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజేందర్, పెండ్యాల రాజు, తాటికొండ రవి కిరణ్, పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేది ఉగాది

ప్రజాపక్షం/భూపాలపల్లి: మన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ ఉగాది అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉగాది ఉత్సవ నిర్వహణ కమిటీ శ్రీ వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇల్లంద క్లబ్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉత్సవ ఉగాది పురస్కారాలు, భూపాలపల్లి మున్సిపాలిటీ పాలకవర్గానికి సన్మానోత్సవము, సంజీవనము పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఎర్రం సతీష్ కుమార్ అధ్యక్షత వహించగా, కొలుగూరి సంజీవరావు తొలి పలుకులు వినిపించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, కళాకారులచే ఏర్పాటుచేసిన నృత్యాలను, పాటలను కవితలను తిలకించారు. వేద పండితులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉగాది అంటేనే తెలుగు వారి పండుగ, నూతన తెలుగు సంవత్సరం ఈ ఉగాది రోజు నుంచే ప్రారంభమవుతుందన్నారు. కాబట్టి ఉగాది పండుగ తెలుగు వారి పండుగగా గుర్తింపు తెచ్చుకుందన్నారు. చైత్ర శుద్ధ పాడ్యమి రోజున జరుపుకునే ఈ పర్వదినానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన ఉగాది ఉత్సవ నిర్వహణ కమిటీ, శ్రీ వివేకానంద సేవ సమితి సభ్యులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, శ్రీనివాస్, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, భూపాలపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, ఉగాది ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు గుజ్జ సారేశ్వరరావు, లక్ష్మారెడ్డి, మండల రాంబాబు,ప్రవీణ్ కుమార్, మంద జోవర్ధన్ పాల్గొన్నారు.

## మహబూబాబాద్ జిల్లాలో గూడూరులో ఐస్ క్రీమ్ బండ్లపై నిషేధం

ప్రజాపక్షం/గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో గూడూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఐస్ క్రీమ్ బండ్లపై నిషేధం విధిస్తున్నాం అనే వార్త సోషల్ మీడియాను కుదిపేస్తుంది.వివరాల్లోకి వెళితే గూడూరు పేరుతో ఒక బ్యానర్ సోషల్ మీడియాలో పెడుతూ విపరీతంగా వైరల్ చేయగా నిజంగా మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గూడూరు మేజర్ గ్రామపంచాయతీలోనే అనుకోని చాలామంది అయోమయానికి గురయ్యారు.అయితే ఇందులో ఒక గ్రామ పేరు పిల్లలఆరోగ్యాన్ని కాపాడేందుకు వినూత్న నిర్ణయం తీసుకుంది. గ్రామంలోకి ఐస్ క్రీమ్ ఆటోలు ఐస్ క్రీమ్ బండ్లు ప్రవేశించకుండా నిషేధం విధిస్తూ గ్రామ పెద్దలు ప్రజలు కలిసి ప్రత్యేక చర్యలు చేపట్టారు. అనే కథనంతో ఈ వార్త చెక్కర్లు కొడుతుండగా ఈనిబంధన ప్రకారం నిషేధాన్ని ఉల్లంఘించి ఎవరైనా ఐస్ క్రీమ్ బండి గ్రామంలోకి తీసుకొస్తే రూ 5.000 జరిమానా విధించనున్నట్లు స్పష్టం చేశారు. ఏది నిజమో ఏది అబద్ధమో తెలియక అందరూ తికమక పడుతున్నారు.

## నార్కోటిక్స్ డాగ్ స్క్వాడ్ బృందంతో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు

ప్రజాపక్షం/గోవిందరావుపేట: ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ కేకన్ ఆదేశాల మేరకు ములుగు డీఎస్పీ కిషోర్ కుమార్ సూచనలు అనుసరిస్తూ సీఐ దయాకర్ పర్యవేక్షణలో పసర ఎస్ ఐ తాజుద్దీన్ ఆధ్వర్యంలో నార్కోటిక్స్ డాగ్స్ స్క్వాడ్ బృందంతో కలిసి ఆకస్మికంగా విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించారు కిరాణా దుకాణాలు మెడికల్ షాపులు ఇతర దుకాణాల్లో ప్రత్యేకంగా ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు ఈ సందర్భంగా ఎస్ ఐ తాజుద్దీన్ మాట్లాడుతూ అక్రమ మత్తు పదార్థాల విక్రయం నిల్వలను అరికట్టడం ప్రజల్లో అవగాహన పెంపొందించడం కోసం నార్కోటిక్స్ డాగ్ సహాయంతో ప్రతి దుకాణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలు వ్యాపారులు చట్టాలను పాటిస్తూ సహకరించాలని అనుమానాస్పద విషయాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.

## కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధికార ప్రతినిధిగా చిక్కుల వెంకటేష్

ప్రజాపక్షం/గోవిందరావుపేట: మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ లో కీలక నియామకం జరిగింది గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన చిక్కుల వెంకటేష్ ని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధికార ప్రతినిధిగా నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల ఆశోక్ నియామక పత్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమం ములుగు జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు వంగ రవి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకల రాధ సుదర్శన్ ములుగు కౌన్సిలర్ గుంటోజు పావని నిరంజన్ చారి మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మి అనిల్ యాదవ్ గ్రామ అధ్యక్షులు వేల్పుగొండ ప్రకాష్ యూత్ కాంగ్రెస్ నాయకులు తాటి శ్రీను పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్షల్లో సెయింట్ మేరీస్ హైస్కూల్ సత్తా

ప్రజాపక్షం/గోవిందరావుపేట: పసర లోని సెయింట్ మేరీస్ హైస్కూల్ విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ దాటారు ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిర్వహించిన ఈ పరీక్షల్లో పాఠశాల మంచి పేరు తీసుకొచ్చారు ఈ పరీక్షల్లో సిహెచ్ రిత్విక్ 12 వ ర్యాంకు సహస్ర 91 వ ర్యాంకు శ్రేష్ఠ 61 వ ర్యాంకు సాధించి నవోదయ లో ప్రవేశానికి ఎంపికయ్యారు విద్యార్థుల ఈ విజయం పై పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## ఎస్‌టి హాస్టల్‌ని ఆకస్మికంగా సందర్శించిన జెసి

ప్రజాపక్షం/జనగామ: జనగామ మండలంలోని పసరమడ్ల గ్రామంలోని ప్రభుత్వ ఎస్టీ హాస్టల్ (బాయ్స్)ని జెసి బెన్షాలోమ్ ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా జెసి కిచెన్, స్టాక్ రిజిస్టర్లు, అటెండెన్స్ రిజిస్టర్ (స్టాఫ్)లను ఆయన పరిశీలించడం జరిగింది. ప్రిన్సిపల్, వార్డెన్లకు భోజన తయారీ, హాస్టల్ నిర్వహణ మీద పలు సూచనలు జారీ చేయడం జరిగింది. వారి వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## నమాజ్ దర్గా వద్ద డాగ్ స్కాడ్‌తో తనిఖీలు ఎస్ఐ పోచయ్య



**ప్రజాపక్షం/రేగోడు మెదక్ జిల్లా :** రేగోడు జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు రంజాన్ పండగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రేగోడ్ గల నమాజ్ దగ్గర వద్ద ఎస్సై పోచయ్య అధ్వర్వంలో శుక్రవారం డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించారు ఎస్సై పోచయ్య మాట్లాడుతూ రంజాన్ పండగ పండగ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త గా బాంబు స్క్వాడ్ తనిఖీలు నిర్వహించిట్లు తెలిపారు ఆయన వెంట బాంబు స్క్వాడ్ ఉన్నారు

## కాంగ్రెస్అధికార ప్రతినిధిగా మహేష్



**ప్రజాపక్షం/వెల్దుర్తి:** మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా వెల్దుర్తి మండలం ఉప్పు లింగాపూర్ గ్రామానికి చెందిన మహేష్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తూ పార్టీ పటిష్టానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని అలాగే మండల నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## యూరియా,గ్యాస్ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు

**ప్రజాపక్షం/పాపన్నపేట:** యూరియా, గ్యాస్ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శుక్రవారం పాపన్నపేట మండల కేంద్రం లోనీ రైతు అగ్రో సెంటర్ ను , ప్యాక్స్ యూరియా స్టాక్ వివరాలను, గ్యాస్ గోదామును పరిశీలించారు. ఎరువులు మందులు రికార్డులను, గ్యాస్ బుకింగ్ రికార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ, జిల్లాలో ఎలాంటి ఎరువులు, మందులు, గ్యాస్ కొరత లేదని స్పష్టం చేశారు. గ్యాస్ గాని, ఎరువులు మందుల గురించి కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు, వినియోగదారులకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్‌లు అనుమతిలేదు




**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జిల్లాలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ పోన్లకు అనుమతి లేదని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య స్పష్టం చేశారు. నిబదనలు కచ్చితంగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షలను పారదర్శకంగా కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వార చీప్ సూపరింటెండెట్లు ,ఎంఈఓలు డిపార్మెంట్ అధికారులు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె దిశనిర్దేశం చేశారు. పరీక్ష కేంద్రాలోకి ఎవరూ మొబైల్ పోన్లు తీసుకురావద్దని కేంద్రంలో ఉన్న సిబ్బంది సహా ఎవరి వద్ద మొబైల్ పోన్లు ఉండకూడదని స్పష్టం చేశారు. పరీక్ష ప్రారంభానికి ముందు ప్రతి హాలును క్షుణ్ణంగా పరిశీలించి చూడాలని సూచించారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు, ఏర్పాటు చేసి పర్యవేక్షణ కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఫ్లయింగ్ స్కాడ్‌లను నియమించి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏలాంటి సంఘటనలు జరిగినా సంబంధిత చీప్ సూపరింటెండెంట్ ఎంఈఓ లదే భాద్యత అని స్పష్టం చేశారు. సబ్జెక్టు టీచర్లను క్లరికల్ సిబ్బందిగా ఉపయోగించిన్నట్లయితే వారిని వెంటనే రీలీవ్ చేసి ఎస్జీటీకేడర్ ఉపాద్యాయులను నియమించాలని ఆదేశించారు. ఆకాల వర్షాల నేపథ్యంలో ప్రశ్నాపత్రాలు ,ఆన్సర్ షీట్లను క్లోజ్ వాహనాలలో సురక్షితంగా తరలించాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అదికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాదికారి వెంకటేశ్వర్లు,ఎంఈఓలు, చీప్ సూపరింటెండెంట్లు ,డిపార్ట్మెంటల్ అధికారులు పాల్గొన్నారు.

## ఈటల రాజేందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కిరణ్ కుమార్ యాదవ్



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** తెలంగాణ రాష్ట్ర బిజెపి బలోపేతానికి,ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ముదిరాజ్ జన్మదినాన్ని పురస్కరించుకొని, మెదక్ జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్ యాదవ్ శుక్రవారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా ఈటెలను కలిసి శాలువాతో సత్కరిస్తూ పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈటెల రాజేందర్ బిజెపికి మాత్రమే కాకుండా,తెలంగాణ ప్రజలకు కూడా అండగా నిలబడే నేత ఆయన నాయకత్వంలో బిజెపి మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. గడిచిన కాలంలో ఆయన ఎలాంటి ఒత్తిడికి లొంగక ప్రజల కోసం పోరాడారు. అదే నిజమైన నాయకుడి లక్షణం, భవిష్యత్తులో ఆయన మార్గదర్శకత్వంలో బిజెపి మరింత బలపడాలని ఆశిస్తున్నాను అని కిరణ్ కుమార్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్ తో పాటు పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశాలకు పిక్సిడ్ వేతనం రూ. 18 వేలు ఇవ్వాలి



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ఆశా వర్కర్లకు ఎన్నికల్లో ఇచ్చిన హామి మేరకు పిక్సిడ్ వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని అంగన్ వాడి అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అద్యక్షురాలు జయలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో వైద్యారాగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇంటిని ఆశావర్కర్లు ముట్టడించారు. అంతకు ముందు పట్టణంలోని పిఎస్ఆర్ గార్డెన్ నుంచి మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇంటి వరకు ర్యాలీ నిర్వహించారు. మంత్రి ఇంటికి ఆశావర్కర్లు వెళ్లకుండా డీఎస్పీ ఆద్వర్యంలో భారీబందోబస్తు నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించుకుంటే చలో హైదరాబాద్ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సందర్బంగా ఆశ యూనియన్ రాష్ట్ర అద్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ ఆశాలకు రూ. 18 వేలు పిక్సిడ్ వేతనం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అన్ని జిల్లాలో కలెకర్టేట్ల ముందు 48 గంటలు ధర్నా నిర్వహించామని తెలిపారు. అదే తప్పని పరిస్థితులో వేతనాలు, పెంచాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా మంత్రుల ఇండ్ల ముందు ధర్నాకార్యక్రమాలకు పిలుపు నివ్వడం జరిగిందని అందులో బాగంగానే సంగారెడ్డిలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇంటిని ముట్టడించడం జరిగిందన్నారు. సమస్యలు పరిష్కరిచేంత వరకు పిక్సిడ్ వేతనం సాదించేవరకు పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించమంటే ఆశా వర్కర్లను అరెస్టులు, నిర్బందాలు చేస్తున్నారని విమర్శించారు. వ్యక్తుల మీద కోసం లేదు. విదానాలపై పోరాటం నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం ఆశా వర్కర్లపై పనిబారం పెంచింద వేతనాలు పెంచడం లేదన్నారు. ఆశావర్కర్లు చేసి శ్రమకు లక్షజీతం ఇచ్చిన తకువనే అని వెంటనే వారికి పిక్సిడ్ వేతనం రూ. 18 వేలు పెంచాలని డిమాండ్ చేశారు.

## బడ్జెట్‌లో విద్యకు మరింత ప్రాధాన్యం ఉంటే బాగుండు

**ప్రజాపక్షం/మెదక్ :** గత బడ్జెట్ లో విద్యకు కేటాయించిన దానికంటే ఈ సారి రాష్ట్ర బడ్జెట్ విద్య కోసం కేటాయింపులు స్వల్పంగా పెరిగినప్పటికీ విద్యాప్రయోజనాల కోసం అవి సరిపోవని టిఆర్టిఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు మెంగర్తి ప్రణీద్ కుమార్ శుక్రవారం ఇక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో విద్య కోసం 15 శాతం కేటాయింపులు చేస్తామని మేని ఫెస్టోలో ప్రకటించినప్పటికీ ఆ స్థాయిలో కేటాయింపులు జరగకపోవడం నిరాశకు గురిచేసిందన్నారు. Tమరో వైపు ప్రభుత్వ ఉద్యోగులకు నగదు రహిత చికిత్స కోసం బడ్జెట్ కేటాయింపులు చేస్తూ డిజిటల్ కార్డులు అందిస్తామని ప్రకటన చేయడం శుభ సూచకమన్నారు. విద్యార్దులకు అల్పాహారం అందించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం కానీ అల్పాహారం మధ్యాహ్న భోజన ఏర్పాట్ల కోసం ప్రత్యేక వ్యవస్థను తీసుకోచ్చి టీచర్లను పాఠాలు బోదించేందుకే పరిమితం చేయాలని కోరారు. దింతో నాణ్యమైన విద్యను బడుగు బలహీన వర్గాల పిల్లలకు అందించాలననే ప్రభుత్వ ఆకాంక్ష నెరవేరుతుందన్నారు.

## కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా బండారి గంగాధర్



**ప్రజాపక్షం/శివ్వంపేట :** కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధికార ప్రతినిధిగా శివ్వంపేట మండల పిల్లుట్ల గ్రామానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు బీసీ నాయకులు బండారి గంగాధర్ నూతనంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించిన టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్‌కు, సీనియర్ నాయకులు మైనంపల్లి హనుమంతరావుకు, జిల్లా గ్రంధాలయ ఛైర్‌పర్సన్ సుహాసినిరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాకు బాధ్యతను పెంచిందని, గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పార్టీని మరింత ప్రతిష్ఠంగా తీర్చిదిద్దుతానని, కార్యకర్తల కోసం అహర్నిశలు కృషి చేస్తానని ఆయన అన్నారు.

## జిల్లా కాంగ్రెస్ కమిటిలో రామాయంపేటకు కీలక పదవులు

**ప్రజాపక్షం/రామాయంపేట:** మెదక్ జిల్లా కాంగ్రేస్ పార్టీ కార్యవర్గంలో రామాయంపేటకు కీలక పదవులు వరించాయి. రామాయంపేట మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దేమె యాదగిరి, కాంగ్రేస్ పార్టీ నాయకులు చింతల యాదగిరి, కోనాపూర్‌కు చెందిన మాజీ సొసైటీ డైరెక్టర్ మామిడి సిద్దరాములుకు జిల్లా ఉపాద్యక్ష పదువులు దక్కగా రామాయంపేట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ భర్త పోచమ్మల గణేష్‌కు కార్యదర్శి పదవి దక్కింది. దీంతో రామాయంపేట మండలానికి నాలుగు పెద్ద పోస్టులు దక్కడంతో పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ పీసీసీ అద్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, డిసిసి అద్యక్షులు ఆంజనేయులుగౌడ్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు అహర్నిశలు కృషి చేస్తామని వారు ప్రకటించారు.

## వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలి



**ప్రజాపక్షం/ పెద్ద శంకరంపేట:** మండల పరిధిలోని బుజరన్ పల్లి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు వారి వారి కుటుంబ సభ్యుల పైన ఉండాలని స్వామి వారిని వేడుకున్నాట్లు చేప్పారు. ఈ సందర్బంగా ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి కి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జైపాల్ గౌడ్, మాజీ సర్పంచ్ విఠల్, హన్మండ్లు, నారాయణఖేడ్ కౌన్సిలర్ బాణపురం రాజు ముదిరాజ్, మహేష్ చౌహన్, న్యాయవాది డోవుర్ సంగన్న తదితరులు ఉన్నారు.

## నమాజ్ దర్గా డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** జిల్లా ఎస్పిడివి శ్రీనివాసరావు ఆదేశానుసారం రంజాన్ పండగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అల్లాదుర్గంలో గల నమాజ్ బొగూడ దగ్గర ఎస్సై శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ, రంజాన్ పండగ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా బాంబు స్క్వాడ్ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయన వెంట బాంబు స్క్వాడ్ సిబ్బంది ఉన్నారు.

# ఇస్నాపూర్‌లో అక్రమ భవనంలో కొత్త స్కూల్ విద్యార్థుల భవిష్యత్తే రిస్క్

## నిబందనలు ఉల్లంఘించిన స్కూల్ పర్మిషన్‌పై విమర్శలు



**ప్రజాపక్షం/పటాన్‌చెరు:**ఇస్నాపూర్ మున్సిఫల్ పరిదిలో నిర్మాణ దశలో ఉన్న భవనంలో నిబంధనలను ఉల్లఘిస్తూ ప్రారంభిస్తున్న ఇంటర్నేషల్ ఢీల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యానికి అధికారులు పర్మిషన్ మంజూరు చేయడం స్థానికుల్లో తీవ్ర విమర్శలకు గురి చేస్తోంది. భవనం పూర్తిగా నిర్మాణం కాకుండానే విద్యార్థుల అడ్మిషన్లు ప్రారంభించడంతో ప్రభుత్వ అనుమతుల పై ప్రశ్నార్థకం నెలకొంది.

**ఇస్నాపూర్ 372 సర్వేలో అక్రమ భవన నిర్మాణం**

ఇస్నాపూర్ సర్వే నంబర్ 372 లో అదికారుల అనుమతి లేకుండానే బిల్డర్ చతురస్త్ర భవనాన్ని నిర్మంచాడే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంకా నిర్మాణ దశలోనే ఉన్న ఆ భవనాన్ని లీజ్‌కు తీసుకొని ప్రైవేట్ స్కూల్ స్థాపించడం స్థానిక నిర్మాణ నియమాలను నిప్పుగా ఉల్లంఘించిన ఉదాహరణంగా గుర్తిస్తున్నారు. భవనం పూర్తి కాకుండానే స్కూల్ ప్రారంభవ ప్రస్తుతం ఆ భవనం పూర్తిగా నిర్మాణం కాకపోవడంమే కాకుండా ప్లేగ్రౌండ్ లేకుండా ఎమర్జిన్సి సౌకర్యాలు లేకుండా ఉందని స్థానిక నివాసులు చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో స్కూల్ పర్మిషన్ ఇవ్వడం విద్యార్థుల భద్రతకు ప్రమాదకరంగా మారిందని వాపోతున్నారు.

**లీగల్ వివాదం నడుస్తుండగానే ఫర్మిషన్ ఏలా?**

అక్రమంగా నిర్మించిన భవనం పై చట్టపరమైన వివాధాలు నడుసుస్తున్నా సంబందిత అధికారులు వెంటనే పర్మిషన్ ఇవ్వడం పైప్రశ్నలు తెరపైకి వచ్చాయి. ఇలాంటి సందర్బంలో పర్మిషన్ ఇవ్వడం వాటాదారుల భద్రత ను ప్రమాదంలో పెట్టే చర్యగా ఉన్నదని ఆందోళన వ్యక్తమవుతోంది యాజమాన్యం భాద్యతా రహితంగా వ్యవహరిస్తోంది. డిఈఓ అనుమతి దొరకిన వెంటనే యథేచ్చగా ప్రచారం చేస్తూ అడ్మిషన్లు తీసుకుంటున్నామంటూ స్కూల్ యాజమన్యాం బహిరంగంగా ప్రకటనలు ఇస్తోంది. ఇది ప్రాణహితులు జీవితాలతో చెలగాటం ఆడుతున్నట్లు స్థానికులు విమర్శిస్తున్నారు.

**మున్సిపల్ ఏఈఓ కార్యాలయ్యాలో పిర్యాదులు :**

ఇస్నాపూర్ మున్సిపల్ ఆపీసులోను ఎఈఓ కార్యాలయంలోను ఈ విషయంపై పిర్యాదులు చేసిన మున్సిపల్ కౌన్సిలర్లు మచ్చ కిషోర్‌రెడ్డి ఎల్లకొండ రాహుల్ రెడ్డి, టూరిగారి నరేందర్ రెడ్డి, తదుపరి చర్యలను డిమాండ్ చేస్తున్నారు. నిబందనలు ఉల్లంఘించిన ఈ స్కూల్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని అదికారులను కోరుతున్నారు.

**చర్యలు తీసుకోవాలి.... డిమాండ్**

సంబందిత ఎంఈఓ ,డీఈఓ అధికారులు వెంటనే ఈ ఆక్రమ భవనంలో నెలకొన్న ఇంటర్నేషన్ ఢీల్లీ పబ్లిక్ స్కూల్ పై చర్యలు తీసుకొని విద్యార్థుల భవిషయతును కాపాడాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. స్థానికులు తల్లిదండ్రులు కూడా ఈ అంశంపై తీవ్ర ఆందోళనతో ఉన్నారు.

# పాపన్నపేట నుండి జిల్లాలో నలుగురికి చోటు

**ప్రజాపక్షం/పాపన్నపేట:**కాంగ్రెస్ పార్టీ జిల్లా నియామకాలలో పాపన్నపేట మండలం నుండి నలుగురికి చోటు లభించడంతో పాపన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు హర్ష వ్యక్తం చేశారు. గురువారం రాత్రి రాష్ట్రంలోని పలు జిల్లాలో జిల్లా కమిటీలు తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ప్రకటించింది. ఈ ప్రకటనలో పాపన్నపేట మండలం నుండి మెదక్ జిల్లాలో నలుగురికి చోటు లభించింది. దీని లో జిల్లా ఉపాధ్యక్షులుగా పి.ప్రశాంత్ రెడ్డి (మల్లంపేట), జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం.రమేష్ గౌడ్ (కుర్తివాడ,) జిల్లా ప్రధాన కార్యదర్శిగా దేవసోత్ ప్రేమ్ కుమార్ రాథోడ్ (రాజ్య తాండ) జిల్లా స్పోక్స్ పర్సన్ గా (అధికార ప్రతినిధిగా) శెట్టి శ్రీకాం తప్ప (పాపన్నపే) ఎన్నికయ్యారు. దీనితో మండల పార్టీ నాయకులు. సర్పంచులు, ఆయా గ్రామాల వార్డ్ మెంబర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామన్నారు. పార్టీ అధిష్టానం నమ్మకంతో పదవులు కేటాయించడంతో మరింత బాధ్యతలు పెరిగాయి అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోసం అహర్నిశలు. రాత్రింబగళ్లు అందుబాటులో ఉంటామన్నారు.

# ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు

## మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/మెదక్ :** మాజీ డిప్యూటీ స్పీకర్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, అల్లా ఆశీస్సులు అందరికీ లభించాలని ప్రార్ధించారు. ముస్లింల జీవితాల్లో రంజాన్ పండుగ ఆనందం, శాంతి, వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. సమాజంలో అందరూ సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలని సూచించారు.

# ఘనంగా ఉగాది సంబురాలు



**ప్రజాపక్షం/సంగారెడ్డి:**ప్రతి ఏడు మాదిరిగా ఈ ఏడాది రామందిర్‌లో ఉగాది వేడుకులు అంభరాన్ని అంటాయి. టీపిసిసి వర్కింగ్ ప్రెసిండెంట్ జగ్గారెడ్డి ఆద్వర్యంలో రామ్ నగర్ రామ్‌మందిరిలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. సంగారెడ్డి పురవీధుల్లో జగ్గారెడ్డి స్వయంగా భక్తి గీతాలు ఆలాపిస్తూ భజనలో ఊరేగింపుటు పాల్గొన్నారు. అనంతరం శ్రీ కృష్ణ భగవానుడి ఉట్టీ కొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తరాలుగా వస్తున్న ఆచారం ప్రకారం రామ్ మందిర్ పై నుండి పేలాల లడ్డూ ప్రసాదాన్ని అందుకుంటే ఆదృష్టం వరిస్తుందని భక్తుల నమ్మకం ,ఈ ప్రసాదాన్ని అందుకోవడానికి వేలాది మంది భక్తులు రామ్ మందిరం చేరుకుని ప్రసాదాన్ని అందుకోవడానికి పోటీ పడ్డారు.

# ఆర్థిక సాయం అందజేత

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** ఇటీవల గుండె అపరేషన్ విజయవంతమై ఇంటికి చేరిన చిన్నారికి ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన అనమైన సరిత సిద్దులు దంపతుల 13నెలల అనూష అనే చిన్నారికి గత 15రోజుల క్రితం కొండపాక మండలంలో గల సత్యసాయి సంజీవని ఆసుపత్రిలో ప్రతాప్ రెడ్డి సహకారంతో ఖరీదైన గుండె అపరేషన్ నిర్వహించారు. దింతో అపరేషన్ విజయవంతమై ఇంటికి చేరిన చిన్నారిని శుక్రవారం పరామర్శించిన ప్రతాప్‌రెడ్డి రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వంటేరు శ్రీనివాస్‌రెడ్డి,కేశమైన మహేందర్, జయమ్మ,మధుసూధన్‌రెడ్డి,సత్యనారా యణ, సిద్దులు,బంగారి,మధు తదితరులు పాల్గొన్నారు.

# మంజీరా నదిలో చేపల మృత్యువాత

## పవ్రలపై చర్యలు తీసుకోవలాని మత్స్యకారుల సంఘం డిమాండ్



**ప్రజాపక్షం/సంగారెడ్డి:**మంజీరా నదిలో చేపలు మృత్యువాత పడ్డాయి. నదిలో కుప్పలు తెప్పలుగా చేపలు చనిపోయి ఉన్నాయి. ఇందుకు ఆయా పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థ జలాలే కారణమంటూ వారిపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారుల సంఘం డిమాండ్ చేసింది. హత్నూర మండలం పల్పనూరు గ్రామ శివారులో వేల సంఖ్యలో చేపలు మృతి చెందాయి.శుక్రవారం ఉదయం నదిలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లగా కుప్పలు తెప్పలుగా పడి ఉన్న చేపలను చూసి కంగుతిన్నారు. వేలాది చేపలు ఒక్కసారిగా మృతితో మంజీరా నది పరిసరాలు కంపు కొడుతున్నాయి. కొన్నేళ్లుగా మంజీరా నదిలో కలుస్తున్న నక్క వాగులోని పారిశ్రామిక వ్యర్థ జలాలే ఇందుకు కారణం అని ఆరోపణలు ఉన్నాయి. పారిశ్రామిక వ్యర్థ జలాలతోనే చేపలు చనిపోయి ఉండవచ్చని మత్యకారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ మంజీరా నదిలో పారిశ్రామిక వ్యర్థ జలాలతో వేలాది చేపల మృత్యువాత పడ్డాయి. చేపల మృతికి కారణమైన పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారుల సంఘం డిమాండ్ చేస్తున్నారు. హత్నూర మండలం పల్పనూరు శివారులో చేపలు చనిపోయిన ఘటనమస్థలాన్ని మత్స్యకారుల సంఘం అద్యక్షుడు మాణయ్య మత్స్యకారులతో కలసి పరిశీలించారు. పరిస్థితులను గమనించిన వీరు దీనికి కారణమైన పరిశ్రమలపై ప్రభ్యుం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంజీరా జలాలు కలుషితం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పల్పనూరు గ్రామానికి చెందిన సుమారు పది కుటుంబాలు చేపల వేటపై ఆదారపడి జీవిస్తున్నాయని పరిశ్రమల నుంచి విడుదలైన కలుషిత నీటీ కారణంగా మంజీరాలో టన్నుల కొద్ది చేపలు మృతి చెందినట్లు పేర్కొన్నారు.

**పరిశ్రమల వ్యర్థజాలలే కారణం**

ఈ నీరు మళ్లీ శుద్ధి కావాలంటే పై ప్రాంతంలోని మంజీరా నది నుంచి నీటిని విడుదల చేయాల్సిందేనని అన్నారు. ఇందుకు సంబందించిన ప్రభుత్వ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. మత్యకారుల జీవనోపాదిని కాపాడేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ,అలాగే కలుషిత నీటిని విడుదల చేస్తున్న కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు.మత్స్యకారుల సంఘం అద్యక్షుడు మాణయ్య మత్స్యకారులతో హత్నూర మండలం పల్పనూర్ శివారులో చేపలు చనిపోయిన ఘటన స్థలానికి చేరకున్నారు. పరిస్థితులను గమనించి దీనికి కారకులైన పరిశ్రమలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మంజీరా జలాలు కలుషితం కావడం వలన ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని అన్నారు.అలాగే ఏదైతే కంపెనీ నుంచి కలుషిత నీరును వదిలేరో ఆ కంపెనీపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# స్వయం ఉపాధి వ్యాపారం దినదిన అభివృద్ధి చెందాలి

**ప్రజాపక్షం/కొల్చారం:**ప్రజలకు సౌకర్యంగా, అందుబాటులో ఉండే నూతన వ్యాపారాలు ఏర్పాటు చేయడం శుభ సూచకమని డీసీఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని అంసాన్ పల్లి గ్రామానికి చెందినభూమేష్ ,మండలకేంద్రమైన కొల్చారంలో నూతనంగా పాలు, పెరుగు, పండ్లు, విక్రయించే వ్యాపారాన్ని ఏర్పాటు చేయగా అట్టి వ్యాపారాన్ని ఇంద్రసేనారెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా కొత్త కొత్త వ్యాపారాలు ఏర్పాటు చేయడం ఎంతో శుభసూచకమని అన్నారు. ఉన్న వ్యాపారాలు ఏర్పాటు చేయకుండా కొత్త రకం వ్యాపారాలు ఏర్పాటు చేయడం వలన ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. వ్యాపారి కూడా అభివృద్ధి చెందుతాడని అన్నారు. అనంతరం ఇంద్రసేనారెడ్డిని భూమేష్ కుటుంబ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంసాన్ పల్లి సర్పంచ్ కన్నెబోయిన గీత రమేష్, వసురంతాండ సర్పంచ్ మలావత్ వినోద్ నాయక్, సంగమేశ్వర్, నర్సింలు గౌడ్, దుర్గాప్రసాద్ గౌడ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# 22న సిద్దిపేట జిల్లాకు సిఎం రాక..

## సభా ప్రాంగణాన్ని పరిశీలించిన అధికారులు..

**ప్రజాపక్షం/సిద్దిపేట:**సిద్దిపేట జిల్లాలోని నంగునూర్ మండలంలోని నర్మెట్టలో నిర్మించిన ఆయిల్ ఫెడ్ ఆయిపామ్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 22న ప్రారంభించనున్నారు.అందులో భాగంగా శుక్రవారం అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్,ఐజీ చంద్రశేఖర్ రెడ్డి,జిల్లా కలెక్టర్ కె.హైమావతి,కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మి పెరుమాళ్,ఆయిల్ ఫెడ్ చైర్మెన్ జంగ రాఘవ రెడ్డి పలువురు అధికారులు పర్యటించి కార్యక్రమం నిర్వహిస్తున్న సభా ప్రాంగణం,వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు,హెలిప్యాడ్ ఏర్పాటు చేసే ప్రదేశాలను పరిశీలించి తగు సూచనలు చేశారు.ఈ మేరకు ప్రజా పాలనలో రైతు మహోత్సవం నిర్వహిస్తున్న ప్రదేశంలో ఏర్పాటు చేసిన స్టాళ్ళను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రత ఏర్పాట్లు పకడ్బంధీగా ఉండేలా చర్యలు తీసుకోవాని ట్రాఫిక్ నిర్వహణకు తగిణ ప్రణాళిక రుపొందించాని అధికారులను ఆదేశించారు.పెద్ద సంఖ్యలో రైతులు,ప్రజలు హాజరయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకోని పార్కింగ్,రాకపోకలు,భధ్రత ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వంతో పని చేయాలని తెలిపారు.అనంతర కలెక్టర్ జిల్లా అధికారులు,రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు.ముఖ్యమంత్రి పర్యటన సంధర్భంగా అధికారిక పాసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు.వివిధ స్థాయిలో విధులు కేటాయించిన అధికారులు మాత్రమే ఉండి విధులను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట,హుస్నాబాద్ ఆర్డీవోలు సాదానందం,రాంమ్మూర్తి,ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్,డిఆర్డీవో జయదేవ్ ఆర్య,డిపివో రవిందర్,డిఎంహెచ్‌వో ధనరాజ్,విద్యుత్,ఆర్‌డబ్ల్యూఎస్,ఫుడ్ సేఫ్టీ,వ్యవసాయ,ఉద్యానవన,ఐఅండ్‌పిఆర్,వివిధ శాఖలు తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ తోఫా పంపిణీ




**ప్రజాపక్షం/అల్లాదుర్గం:**అల్లాదుర్గం మండల మహిళా సమైక్య సమావేశ మందిరంలో ముస్లిం సోదరులకు ప్రభుత్వం తరపున రంజాన్ తోఫా అందజేశారు. తహసిల్దార్ మల్లయ్య, వాట్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీ శేషారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల పేద ముస్లిం కుటుంబాలకు ప్రభుత్వం తరపున రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శేషారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుభాష్ రావు, ప్రధాన కార్యదర్శి బాల కిషన్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బలరాం, ఆ గ్రామాల సర్పంచులు సౌమ్య సురేష్ గౌడ్, శశిధర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శంకర్ నాయక్, మచ్చేందర్, రవి, వీరప్ప, కవిత, తదితరులున్నారు.

## ఇఫ్తార్ విందు



**ప్రజాపక్షం/దేవరుప్పుల :** మండల కేంద్రంలోని దాదాసాహెబ్ కాలనీలో రంజాన్ పండుగ ఉపవాస దీక్ష సందర్భంగా శుక్రవారం స్థానిక మాజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ నాయకులు ఏల సుందర్ మాట్లాడుతూ కేసీఆర్ సీఎంగా ఉన్నపుడు రంజాన్ తోఫా, పేదింటి ఆడబిడ్డల పెట్టికి షాదీ ముబారక్, మైనార్టీ రుణాలు, ముస్లీంలకు ప్రత్యేక రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసి ముస్లీంల ఆర్థిక పురోగతి చెందడానికి ప్రత్యేక శ్రద్ధతో నాటి ప్రభుత్వం చొరవ తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో మత గురువు షేక్ అప్సర్, మత పెద్దలు ఇమామియా, మదార్, కమల్, జాని, షరీఫ్, కాసిం, మాలిక్, సలీం, సుబాని, హైద్, మునీర్, పోలేర్, మదార్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/కమలాపూర్ :** మల్కాజ్‌గిరి ఎంపి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ జన్మదినాన్ని పురస్కరించుకోని కమలాపూర్ మండల కేంద్రంలోని రావిచెట్టు వద్ద బిజెపి మండల పార్టీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ముందుగా కమలాపూర్ లోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రావి చెట్టు వద్ద కేక్ కట చేసి మిఠాయిలు పంచారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుప్రతిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ శనిగరం సర్పంచులు పబ్బు సతీష్, కొత్తపల్లి రాజు, బిజెపి నాయకులు గంధసిరి రవి కుమార్, మౌటం రమేష్ బాబు, కనుకుంట్ల అరవింద్, మేకల రవి, తుమ్మ శోభన్ బాబు, ఓదెలు, మౌటం సంపత్, రఘు, గౌర్రె మధుసూదన్ రెడ్డి, చెలికె శ్రీనివాస్, పిల్లి వినయ్, రాజేశ్వర్ రావు, అశోక్, ప్రసాద్, కుమార్, రంజీత్, రమేష్, సాంబయ్య, కొమురయ్య, కరుణాకర్ రెడ్డి, తిరుపతి, శేఖరయ్య, బిక్షపతి, సంపత్, సారంగం, చంద్రయ్య, చందర్ సింగ్, రాజేష్, యువకులు, గ్రామ ప్రజలు, కార్యకర్తలు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన పొన్నం అనూప్

**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** ఎల్కతుర్తి మండలం గోపాలపూర్ గ్రామంలో ముంజ శ్రీకాంత్, శ్రీనివాస్ తండ్రి ముంజ రాజయ్య ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని, వారి కుటుంబ సభ్యులను ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పొన్నం అనూప్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంజ శ్రీకాంత్ నాకు ఆత్మీయులు, వారి తండ్రి మరణం చాలా బాధాకరం అన్నారు. వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని, వారికి అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే అసెంబ్లీ ప్రసంగంపై కాంగ్రెస్ నాయకుల హర్షం



**ప్రజాపక్షం/కొడకండ్ల:** మండల కేంద్రంలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలంటూ పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రసంగం పట్ల కాంగ్రెస్ మండల అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో కొడకండ్ల మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించడంతోపాటు ఈ అంశాన్ని మంత్రి దామోదర రాజనర్సింహను ఆమె కలిసి ప్రజా ఆరోగ్యంపై వారికున్న కట్టుబాటుకు నిదర్శనమన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు మధురం రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సురేష్ నాయక్ పాల్గొని మాట్లాడుతూ కొడకండ్ల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే ప్రస్తావించడం, మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించడం ఎంతో అభినందనీయమన్నారు. గత పాలకులు పట్టించుకోక పోవడంతో ప్రజలు ఆసుపత్రులలో ఇబ్బందులు పడగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి బాధ్యతలు చేపట్టిన ర్వాత ప్రజల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మమత సతీష్ గౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ మధుసూధన్, గిర్ని తండా సర్పంచ్ సుధీర్ నాయక్, జిల్లా కార్యదర్శి బిక్షపతి, నాయకులు మనోహర్, శ్రీనివాస్, ఐలయ్య, శివరాములు, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కరుణాకర్ రావుకు రాష్ట్ర స్థాయి సేవారత్న పురస్కారం



**ప్రజాపక్షం/కాటారం:** విద్యారంగం, సామాజిక సేవలో నాలుగు దశాబ్దాలుగా విశిష్ట సేవలందిస్తున్న మండల కేంద్రానికి చెందిన ప్రముఖ విద్యావేత్త,ఆదర్శ విద్యా సంస్థల అధినేత జనగామ కరుణాకర్ రావుకు రాష్ట్ర స్థాయి ఉత్తమ సేవారత్న పురస్కారం లభించింది.గురువారం జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్‌లో నిర్వహించిన ఉగాది పురస్కారాల కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు,రాష్ట్ర ట్రేడ్ కార్పోరేషన్ చైర్మెన్ ఐత ప్రకాష్ రెడ్డి,జిల్లా గ్రందాలయ చైర్మెన్ కోట రాజబాబు,ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్,ప్రముఖులు కరుణాకర్ రావును అభినందించి సత్కరించి అవార్డు అందజేసారు.కరుణాకర్ రావు,ప్రభుత్వ ఉపాద్యాయుడిగా,ఆదర్శ విద్యా సంస్థల చైర్మెన్‌గా గత నాలుగు దశాబ్దాలుగా విద్యా రంగంలో అందిస్తున్న సేవలతో పాటు పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందిచి వారి భవిశ్యత్తుకు బాటలు వేసిన వ్యక్తిగా గుర్తింపు పొందారు.విద్యతో పాటు సమాజ సేవలో ముందుండి అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందారు.తెలంగాణ ఉద్యమ సమయంలో చురుకైన పాత్ర పోషించడంతో పాటు ప్రజా సమస్యల పరిశ్కారానికి కృషి చేసిన కరుణాకర్ రావు,తన సేవా భావం పట్టుదలతో సమాజంలో ప్రత్యేక స్థానం పొందారు.దీనిని గుర్తించిన రాష్ట్ర స్థాయిలో సాధించిన గుర్తింపుకు పురస్కారం లభించింది.ఈ సందర్భంగా కరుణాకర్ రావును పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా మున్సిపల్ చైర్మెన్ బుర్ర కొమురయ్య గౌడ్,వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు సంజీవ రావు,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ్ లైఫ్ ఇన్స్‌రెన్స్ బీమా చెక్కు అందజేత



**ప్రజాపక్షం/టేకుమట్ల :** మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన ఉల్లి శ్రీను కొంత కాలం క్రీతం అనారోగ్యంలో మృతిచెందగా అందుకు గాను నామిని అయినా భార్య ఉల్లి సుజాతకు శ్రీ రామ్ లైఫ్ ఇన్స్‌రెన్స్ కాల్వశ్రీరాంపూర్ బ్రాంచ్ నుంచి భీమా చెక్కును హక్కును ఎస్ఐ జి అమూల్య చేతుల మీదుగా చెక్కును అందించారు.ఉల్లి శ్రీనివాస్ ప్రీమియం 25073 కట్టి రెండు నెలల వ్యవదిలో మరణించాడు.వారి కుటుంబానికి శ్రీరామ్ లైఫ్ ఇన్స్‌రెన్స్ ద్వారా 3,91,660 రూపాల బీమా మొత్తాన్ని అందించారు.లైఫ్ ఇన్స్‌రెన్స్ డీజిఎం సతీష్ మాట్లాడుతూ జీవిత భీమా కుటుంబానికి ధీమాగా ఉంటుందని అన్నారు.భీమాలేని జీవితం గమ్యంలేని ప్రయాణం లాంటిదని ప్రతి ఒక్కరికి జీవిత భీమా అవసరం అన్నారు.ఈకార్యక్రమంలో ఆర్ఎం వెంకట్రాజ్యం,బ్రాంచ్ మేనేజర్ బుర్ర అఖిల్,పుదారి శివప్రసాద్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొటగిరి సతీష్ గౌడ్,గ్రామ సర్పంచ్ బొడ్డు తిరుపతి,ఉప సర్పంచ్ అఫ్జల్,డివో సుమతి,బేతు రాజు,బుర్ర చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల సాగుతో తక్కువ కాలంలో ఆదాయం



**ప్రజాపక్షం/కాటారం :** కూరగాయల సాగుతో తక్కువ కాలంలో ఆదాయం వస్తుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గంగారం గ్రామంలో ద్యాన శాఖ ఆధ్వర్యంలో ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగారం గ్రామంలో ప్రతీ కుటుంబం కూరగాయల సాగుపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. కూరగాయల సాగు తక్కువ కాలంలో ఆదాయం అందించే ముఖ్యమైన పంటగా నిలుస్తుందని సరైన ప్రణాళికతో సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని అన్నారు.సీజన్‌కు అణుగుణంగా సరైన రకాలు ఎంపిక చేసుకుని ,నాణ్యమైన విత్తనాలు వినయోగం,సమతుల్యత, ఎరువుల వినియోగం, తగినంత నీటి నిర్వహణ, మల్చింగ్ విధానం వంటి ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా దిగుబడి నాణ్యం పెరుగుతుందని అన్నారు. అలాగే ఇంటి వద్ద చిన్న స్థాయి కూరగాయల తోటలు ఏర్పా టు చేసుకోవడం ద్వారా కుటుంబానికి పోషకాహారం లభించడమే కా కుండా అదనపు ఆదాయం పొందవచ్చని అన్నారు. కూరగాయల పంటలలో కనిపించే ముఖ్యమైన చీడపీడలు,వ్యాధులను సమయానికి గుర్తించి సమగ్ర కీటక నియంత్రణ పద్దతులను అనుసరించడం ద్వారా ఖర్చు తగ్గించి మంచి దిగుబడులు సాధించవచ్చని అన్నారు. అలాగే ఉద్యాన శాఖ ద్వారా అమలు ఏస్తున్న వివిధ ప థకాలు ముఖ్యంగా కూరగాయల సాగును ప్రోత్సహించి రైతులకు వాటిని వినియోగించుకోవాని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్, వ్యవసాయ విస్తరణ , ఉద్యాన విస్తరణ అధికారి రాందాస్, దైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మల్లూరు హేమాచలుని ఆలయంలో హుండీలా లెక్కింపు

**ప్రజాపక్షం/మంగపేట :** ములుగు జిల్లా మంగపేట మండలంలో మల్లూరు హేమచల కొండల్లో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మి నృసింహ స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారి కల్యాణ మండపంలో మందరగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కార్యనిర్వాహన అధికారి శ్రీనివాస్ పర్యవేక్షణలో భక్తులు స్వామివారికి మూడు నెలల 15రోజుల కానుకలు వేసిన 9 హుండీలను లెక్కించగా 12,.59,594 రూపాయల ఆదాయం ఆలయానికి వచ్చింది అని శ్రీ లక్ష్మి నృసింహ దేవాలయం కార్యనిర్వాహన అధికారి మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వికాస్ బ్యాంకు మల్లూరు రెవిన్యూ సేవ సమితి సభ్యులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాస్థాయికి ఎంపికైనా విద్యార్థికి సన్మానం

**ప్రజాపక్షం/టేకుమట్ల :** భూపాలపల్లి జిల్లా మండలం వెంకట్రావ్‌పల్లి గ్రామ ఎంపిపిఎస్ పాఠశాలకు చెందిన చెరుకు వేదావ్యాస్ అనే మూడవ తరగతి చదువుతున్న విద్యార్థి స్పోర్ట్స్ స్కూల్ జిల్లా స్థాయికి ఎంపికైనా సందర్భంగా శుక్రవారం ఆ గ్రామస్తుడు నేరెళ్ల ఓం నారాయణ గౌడ్ శాలువాతో విద్యార్థిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు, స్వామి, ఉపాధ్యాయులు, విధ్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జాలిమడి గ్రామంలో చేతిపంపులు

**ప్రజాపక్షం/మధిర రూరల్ :** మధిర మండలం జాలిమూడి గ్రామంలో హరిజనవాడ నందు గ్రామ సర్పంచ్ కోటేశ్వరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రేస్ సొసైటీ సంస్థ వారి ఆర్థిక సహాయంతో గ్రామంలో రెండు చేతిపంపులను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ కోటేశ్వరి మాట్లాడుతూ రానున్న ఎండాకాలంలో గ్రామ ప్రజల మంచినీటి అవసరాల కొరకు ఈ రెండు చేతి పంపులకు ఆర్థిక సహాయం చేసి నందుకు గ్రేస్ స్వచ్ఛంద సంస్థ వారిని అభినందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ వైస్ ప్రెసిడెంట్ యరమల మానస వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గీతాంజలిలో ప్రీ రంజాన్ వేడుకలు




**ప్రజాపక్షం/నర్సంపేట :** ముస్లిం ప్రజలు అందరూ ఎంతో వైభవంగా నిర్వహించుకునే పండుగ రంజాన్‌ను పురస్కరించుకొని నర్సంపేట పట్టణంలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎన్ రాజేష్ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం భారత దేశం ప్రత్యేకతఅని, అందుకే ప్రపంచ దేశాలలో ఎక్కడ లేని విధంగా రకరకాల మతాలవారిగా భాషల వారిగా ఇక్కడ ఒకటిగా జీవిస్తారన్నారు. అందరూ అన్ని పండుగలను ఆదరించి గౌరవించి జరుపుకుంటారు. ప్రపంచ దేశాలు మన దేశం వైపు గర్వంగా చూడడానికి కారణం భారతీయ ప్రజలందరూ కలిసికట్టుగా ఉండడమే అని అందుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలతోనే జ్ఞానం

**ప్రజాపక్షం/కమలాపూర్ :** గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం వల్ల యువతతో పాటు ప్రతి ఒక్కరు జ్ఞానాన్ని పొందవచ్చని మండలంలోని కానిపర్తి సర్పంచ్ కోడిగూటి చేరాలు అన్నారు. గ్రామంలో స్నేహ సేవ ఫౌండేషన్ సహకారంతో చైతన్య గ్రంథాలయాన్ని సర్పంచ్ కోడిగుటి చేరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... శ్రీ పరాభవ తెలుగు సంవత్సరం ఉగాది సందర్భంగా స్నేహ సేవా ఫౌండేషన్ వారి గ్రంథాలయం ఏర్పడడం సంతోషంగా ఉందని అన్నారు. స్నేహ సేవా ఫౌండేషన్ అధినేత మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి (యుఎస్ఏ) తన ఊరిలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమని, వారికి వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేహ సేవా ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు తొగరి హనుమయ్య, ప్రధాన కార్యదర్శి నరెడ్ల సీతారాం రెడ్డి, వర్కింగ్ కమిటి ప్రెసిడెంట్ జనగాని సుమన్, ఉప సర్పంచ్ జనగాని చారి బాబు, మాజీ సర్పంచ్ ఇంద్రసేన, మార్కెట్ కమిటి డైరెక్టర్ జనగాని శివకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ కన్నబోయిన అశోక్, మహిళా సంఘం వివోఏ ఉమారాణి, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చికుక్క దాడిలో 15మందికి గాయాలు



**ప్రజాపక్షం/దుబ్బాక:** దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని శుక్రవారం పిచ్చి కుక్క భయాందోళన సృష్టించింది. పట్టణంలో గంట వ్యవధిలోనే 15మందిపై దాడి చేసి కాటు వేసింది. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో అతడిని మెరుగైన వైద్యం నిమిత్తం సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగతా 14 మందికి దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో చిక్సిత అందిస్తున్నారు.

## మల్లన్న సాగర్ ప్రధాన కాల్వకు గండి

**ప్రజాపక్షం/దుబ్బాక:** మల్లన్న సాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువకు భారీ గండి పడింది. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ శివారులో కాల్వకు భారీ గండి పడడంతో సమీపంలోని కందుల చెరువులోకి నీరు ప్రవహిస్తోంది. ఈ కాలువ ద్వారా జిల్లాలో చాలా గ్రామాలతో పాటు రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో పలు గ్రామాలకు చెరువులు, పంట పొలాలకు నీరు అందుతోంది. సుమారు 50 కిలో మీటర్ల మేర నిర్మించిన ఈ ప్రధాన కాల్వ ద్వారా వేల ఎకరాల పంట పొలాలకు నీరు అందుతోంది. కాల్వకు గండి పండడంతో నీరు వృధాగా పోతున్న సమాచారం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు తాత్కాలికంగా గండి మరమ్మతులు చేపట్టారు. పంట ఎండిపోయే ప్రమాదం ఉందని అధికారులు స్పందించి నీటిని కాల్వ ద్వారా విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవలసిన బాధ్యత అందరిది

**ప్రజాపక్షం/బెజ్జంకి:** ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవలసిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సర్పంచ్ ముక్కీస కవిత రత్నాకర్ రెడ్డి అన్నారు.శుక్రవారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సర్పంచ్ తన స్వంత ఖర్చులతో పాఠశాల పేరును తెలియజేసే ప్రధాన ముఖద్వారాన్ని ఏర్పాటు చేశారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని తనకు విద్యా బుద్దులు నేర్పించిన పాఠశాల తనకు దేవాలయం లాంటిదని అలాంటి పాఠశాలకు ఏదైనా మంచిపని చేసేందుకు తాను సిద్దమేనని అన్నారు.అంతేకాకుండా పాఠశాలలో ప్రస్తుతం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పూర్వ విద్యార్థులు తమకు తోచిన సహాయసహకారాలు అందిచాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ సాదుద్దీన్,ఉపాధ్యాయురాలు సునీత,పంచాయితీ కార్యదర్శి అనుష,ఉప సర్పంచ్ గంగధర హరీష్, వార్డు సభ్యులు రమణారెడ్డి, వెంకవ్వ, బాలవ్వ,లచ్చవ్వ తదితరులు పాల్గొన్నారు

# అబద్ధపు హామీలతో కాలం వెళ్లదీస్తున్న ప్రభుత్వం



**ప్రజాపక్షం/హనుమకొండ:** కాంగ్రెస్ ప్రభుత్వం అరడజను అబద్ధపు హామీలతో కాలం వెళ్లదీస్తున్నదని బిజెపిరాష్ట్ర నాయకురాలు రాణి రుద్రమ విమర్శించారు. శుక్రవారం హనుమకొండలో బిజెపినాయకులు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ హాజరయ్యారు.హనుమకొండ అదాలత్ జంక్షన్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో బిజెపిరాష్ట్ర నేతలు, జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాణి రుద్రమ మాట్లాడుతూ అర డజన్ అబద్ధపు హామీలు.. 420 వేషాలతో కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సకల జనులను సర్వం మోసం చేసింది అని అన్నారు.రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఒక్క హామీని కూడా సరిగ్గా అమలు చేయకుండా ప్రజలను వంచిస్తోందని మండిపడ్డారు. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ సమస్యలను గాలికొదిలేశారని, డి.ఏ. బకాయిల చెల్లింపులో జాప్యం చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.భూ భారతి పేరుతో నెలకొన్న గందరగోళాన్ని చక్కదిద్దడంలో ప్రభుత్వం విఫలమైందని, స్థానిక ప్రజా సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని విమర్శించారు.బిజెపిరాష్ట్ర నాయకురాలు, వరంగల్ పశ్చిమ అసెంబ్లీ పోటీ చేసిన అభ్యర్థి రావు పద్మా రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఓరుగల్లు నగర అభివృధి కొరకు స్మార్ట్ సిటీ, అమృత్, హృదయ్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ , టెక్ స్టైల్ పార్క్ వంటి ఎన్నో పథకాలను ఇస్తే వాటిని అమలుచేయలేక నిర్వీర్యం చేసిన ఘనత ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వందని అన్నారు. బిజెపిఎప్పుడూ ప్రజల పక్షాన ఉంటుందని, ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి, పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ అభ్యర్థి డాక్టర్ పి. కాళీ ప్రసాదరావు, డాక్టర్ పి. విజయ్ చందర్ రెడ్డి,దేవేందర్ రెడ్డి,చాడా శ్రీనివాస్ రెడ్డి, రావుల కిషన్, కార్పొరేటర్ రావుల కోమల తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో కార్మిక వర్గానికి మొండి చేయి

**ప్రజాపక్షం/నర్సంపేట:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్ లో కార్మిక వర్గానికి మొండి చేయి చూపారని బిఆర్‌టియూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కార్మిక వర్గానికి అనేక హామీలు ఇచ్చిందని, ఇచ్చిన హామీలు నెరవేరాలంటే బడ్జెట్లో నిధులు కేటాయింపు లేకుండా ఏ విధంగా నెరవేరుతాయని ప్రశ్నించారు. ఇప్పటికీ మూడు బడ్జెట్ ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్లో ఉద్యోగ కార్మిక వర్గానికి నిధుల కేటాయింపు జరగలేదన్నారు. ఆశలకు, అంగన్‌వాడీలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.18 వేల చొప్పున మధ్యాహ్న భోజన కార్మికులకు వివోఏలకు, ఆర్పీలకు 10 000 రూపాయల చొప్పున మున్సిపల్ కార్మికులకు ,కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులకు రూ. 24 వేల రూపాయల చొప్పున, అసంఘటిత కార్మికుల సంక్షేమానికి సంక్షేమ బోర్డు ఆటో కార్మికులకు పదివేల రూపాయల భృతి ఇస్తామని చెప్పి రెండున్నర సంవత్సరాలు గడిచిన బడ్జెట్ కేటాయింపులు లేకుండా వేతనాలు ఎలా పెరుగుతాయని ప్రశ్నించారు. వేతనాల కోసం సమ్మెలో జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# విజ్ డమ్ హై స్కూల్ మెడికో విద్యార్థులకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/ నర్సంపేట:** 2022–2023 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన ఇద్దరు విద్యార్థినిలు 2025 నీట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి ఎంబిబిఎస్ లో సీట్లు సాధించారని పాఠశాల డైరెక్టర్ జావేద్ అన్నారు. శరదృతి ఉత్తమ ర్యాంకును సాధించి కాకతీయ మెడికల్ కాలేజీ వరంగల్ లో, ముత్తినేని అంకిత ఆదిలాబాద్ లోని రిమ్స్ కాలేజీలో ప్రవేశాలు పొందారని, ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ జావేద్ మాట్లాడుతూ విద్యార్థులు బాల్య దశ నుండే క్రమశిక్షణను కలిగి తల్లిదండ్రుల పట్ల అభిమానం, ఉపాధ్యాయుల పట్ల గౌరవం తో విద్యను ఆర్జించినప్పుడే అనుకున్న ఫలితాలు సాధిస్తారని, దీనికి నిదర్శనమే మా ఈ విద్యార్థుల ఫలితాలని తెలుపుతూ ఎంబిబిఎస్ లో ప్రవేశాలు పొందిన విద్యార్థులను అభినందించారు. చాలినంత సన్నాహం పైనే విజయం ఆధారపడి ఉంటుందని అది లేనట్లయితే అపజయం తధ్యమన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జహంగీర్, అకాడమిక్ ఇన్చార్జి నాజియా ఇక్బాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్, ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ ఫహీం సుల్తానా, ఇన్చార్జి హారిక, మెడికో విద్యార్థినిలు శరదృతి, హారిక, అంకిత, తల్లిదండ్రులు భీమ్ సింగ్, సోమేశ్వర్, ఉపాధ్యాయులు వీరభద్రయ్య, రాము, ఇలియాస్, శివరాజ్, కుమార్, రఘుపతి రెడ్డి, ఎల్. రవీందర్, బి. రవీందర్, సుమన్, మధు, మంజుల, శ్రీలత, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ తోపా కిట్ల పంపిణీ

**ప్రజాపక్షం/మంగపేట :** ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామంలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు టీవీ హీదాయతుల్లా ఆధ్వర్యంలో కమలాపురం ముస్లిం సోదరి సోదరిమనులకు తెలంగాణ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి హామీ రాష్ట్ర మంత్రి దణసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు రంజాన్ పండుగ సందర్భంగా ముఖ్య ఆతిధులుగా రాష్ట్ర పంచాయతీ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, మండల అధ్యక్షులు మైల జయరాం రెడ్డి హాజరై ఈద్ ముబారక్ తోపా కిట్లను ముస్లిం సోదరులకు పంపిణి చేశారు. అనంతరం వారు మాట్లాడుతు ఆ అల్లా దీవెనలు అందరిపై ఉండాలి ముస్లింలు రంజాన్ పండుగను జరుపుకొనుటకు రంజాన్ నెల నేపథ్యంలో ముస్లింలు గత నెల రోజులుగా ఉపవాస దీక్షలు చేస్తూ నేటితో ముగించుకొని బంధుమిత్రులతో రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలని ముస్లిం కుటుంబాలకు ఈద్ ముబారక్ తోఫా కిట్లను అందించి ముస్లిం కుటుంబాలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అయోరి యాణయ్య, జిల్లా కార్యదర్శి తూడి భగవాన్ రెడ్డి, జిల్లా మై నార్టీ ఉపాధ్యక్షులు మహబూబ్ ఖాన్, బీసీ సెల్ మండల అధ్యక్షులు ముత్తినేని ఆదినారాయణ, మాజీ సొసైటీ డైరెక్ట ర్ శేషగిరి, మహమ్మద్ సయ్యద్ హుస్సేన్ పాల్గొన్నారు.

## శ్రీ గణేష్ దేవస్థానంలో హుండీ లెక్కింపు రూ. 27.33 లక్షలు



**ప్రజాపక్షం/పటాన్‌చెరు:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రసిద్ధ రుద్రారం గణేష్ గడ్డ శ్రీ గణేష్ దేవస్థానంలో శుక్రవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాదాయ శాఖ ఇనెస్పెక్టర్ రాంగరావు ఆద్వర్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) లావణ్య చైర్మన్ హరి ప్రసాద్ రెడ్డి సమక్షంలో లెక్కింపు జరిగింది. గత 86 రోజుల కాలానికి సంబందించిన హుండీ లెక్కింపును భక్తుల సహకారంతో చేపట్టగా మొత్తం రూ. 27,93,564 ఆదాయం వచ్చినట్లు అదికారులు వెల్లడించారు. ఇందులో హుండీ ద్వార రూ. 26,44,922 ,అన్నదాన హుండీ ద్వారా రూ. 1,48,642 సమకూరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈవో లావణ్య మాట్లాడుతూ భక్తులు సమర్పించిన ఈ నిధులను ఆలయ అభివృద్ధి పనులు భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు వినియోగిస్తామని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే ఈ సారి భక్తు రద్దీ గణనీయంగా పెరిగిందని ఎక్కువ మంది భక్తులు ఆయానిన దర్శించి తమ మొక్కులు చెల్లించుకోవడం వల్లే ఆదాయం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు జె. సంతోష్ . కమిటీ సభ్యులు చంద్రశేఖర్, జగదీష్, సతీష్, అయ్యప్ప, ఈశ్వర్, శివ కేశవ సేవా సమితి సభ్యులు అధికారులు భక్తులు తదతరులు పాల్గొన్నారు.

## సిఎం రీలీఫ్ పండ్‌తో పేదలకు ఆర్థిక భరోసా

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** సిఎం సహాయ నిధితో పేదలకు ఆర్థిక భరోసా నిస్తుందని యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు, తిగుల్ మాజీ సర్పంచ్ భానుప్రకాష్‌రావు పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రుల పాలైన తిగుల్ గ్రామానికి చెందిన నాలుగురు బాధితులకు మంజూరైన సిఎం రీలీఫ్ పంఢ్ చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతిగా పని చేస్తుందని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రాజాపాలనలో ప్రజల సంక్షేమమే ముఖ్య ఎజెండాగా పనిచేస్తున్నారని అన్నారు. పేదలకు పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని అమలు చేయడంలో నిరంతరం పని చేస్తున్నారని గుర్తు జేశారు.

## మల్లన్న సాగర్ ప్రధాన కాల్వకు గండి

**ప్రజాపక్షం/దుబ్బాక:** మల్లన్న సాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువకు భారీ గండి పడింది. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ శి వారులో కాల్వకు భారీ గండి పడడంతో సమీపంలోని కందుల చెరువులోకి నీరు ప్రవహిస్తోంది. ఈ కాలువ ద్వారా జిల్లాలో చాలా గ్రా మాలతో పాటు రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో ప లు గ్రామాలకు చెరువులు, పంట పొలాలకు నీరు అందుతోంది. సు మారు 50 కిలో మీటర్ల మేర నిర్మించిన ఈ ప్రధాన కాల్వ ద్వారా వేల ఎకరాల పంట పొలాలకు నీరు అందుతోంది. కాల్వకు గండి పండడంతో నీరు వృధాగా పోతున్న సమాచారం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు తాత్కాలికంగా గండి మరమ్మతులు చేపట్టారు. పంట ఎండిపోయే ప్రమాదం ఉందని అధికారులు స్పందించి నీటిని కాల్వ ద్వారా విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

## నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి అర్హత సాధించిన విద్యార్థి

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** నవోదయ విద్యాలయంలో 6 తరగతి ప్రవేశానికి మండలంలోని వెంకటాపూర్(బిజి) ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఇటీవల నిర్వహించిన అర్హత పరీక్షల్లో ర్యాంకు సాధించి ఎన్నికయ్యారు. గ్రామానికి చెందిన పోకల తనూష్ ఉత్తమ ఫలితం సాధించి వర్గల్ నవదయ విద్యాలయంలో ప్రవేశం సాధించడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాత్లావత్ బొద్దునాయక్, మునిగడప ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనుకయ్య విద్యార్థి తానుష్‌ను శుక్రవారం పాఠశాలలో శాలువతో సన్మానించారు.